# గ్రహణం

**- డి. నారాయణవర్మ**

నగరంలో జన సంచారం లేని మారు మూల ప్రాంతంలో, పాడు బడ్డ ధర్మ సత్రంలో విశాలమైన వరండా—దానికి రెండు వేపులా దారులున్నాయి. ఎడమదారి (ఎల్.ఎఫ్.) బయటనుండి రాకపోకలకూ, కుడి దారి(ఆర్.ఎఫ్.) సత్రం వెనక భాగానికి వెళ్ళడానికీ ఉపయోగ పడతాయి. ఎడమ గుమ్మానికి (ఎల్.బి.) వాల్ పోస్టర్లలో ఉన్న దళసరి తడక అడ్డం పెట్టబడి ఉంది. ఆ గదిలో సింహాద్రి, అబ్బులు ఉంటున్నారు. కుడి గుమ్మానికి (ఆర్.బి.) పొడుగాటి గోనె గుడ్డ కర్టెన్ మాదిరిగా వేలాడ తూంది. ఆ గదిలో భాస్కర్ ఉంటున్నాడు. రెండు గుమ్మాలకు మధ్యగా వరండాలో పాత నులక మంచం మాత్రమే ఉంది.

### తెర తొలగింది

[ఓ నాటి సాయంకాలం వేళ. సాత్వికంగా, అతి సాదారణంగా ఉన్న భాస్కర్ వరండాలో నులక మంచాన్ని ఆనుకుని కూర్చుని, దైన్యంగా శూన్యం లోకి చూస్తూ, రెండు క్షణాలు గడిపి తన గదికి వెళ్ళిపోయాడు. అదే క్షణంలో పీలగా ఉన్న అబ్బులు బయట నుండి పరుగున వరండాలోకి వచ్చాడు. అతను ఆయాసం తీర్చుకో బోతూండగా, సత్రం వెనక నుండి బలిష్టంగా ఉన్న సింహాద్రి కూడా పరుగున వచ్చాడు.]

సింహాద్రి: ( ఆదుర్దాగా ) అబ్బులూ!
అబ్బులు: ( మెల్లగా ) ఏం, గురూ!
సింహాద్రి: సత్రం లోకి రావడం ఎవులూ సూడ్లేదుగా?
అబ్బులు: అది నాను గాడ్లేదు!
సింహాద్రి: ఈ తలుపుం గడి యెట్టేసినావా?
అబ్బులు: ఆఁ!
సింహాద్రి: పర్స్ ఏది?
అబ్బులు: ఇద్గిగో, ఇమ్మంతావేటి? ( ఇవ్వబోయాడు. )
సింహాద్రి: ఉంచుంచు. ఇద్దాగాన్లే!

( ఇలా వాళ్ళిద్దరూ గుస గుస లాడుకుంటూంటే, భాస్కర్ వచ్చి మౌనంగా నిలబడ్డాడు. అదే క్షణంలో దూరంగా పోలీస్ విజిల్స్ వినిపించాయి. వాళ్ళిద్దరూ కంగారు పడి పోతూ భాస్కర్‌ను చూశారు. )

సింహాద్రి: ( తప్పు కప్పి పుచ్చుకునే ప్రయత్నంలో నసుగుతూ ) అ. . .ది. . . కా. . .కాదు. . ., బాస్కరం బాబూ!
భాస్కర్: ( తీవ్రంగా చూస్తూ ) ఏది కాదు—దొంగతనం చెయ్యడమా?
అబ్బులు: అబ్బే. మాం సెయ్యనేదే!
భాస్కర్: మీరు కాదన్నా, మీ కంగారే చెబుతుంది నిజాన్ని! వినిపించే పోలీస్ విజిల్స్ దాన్ని ఋజువు పరుస్తున్నాయి!
సింహాద్రి: ( తెగించి ) ఊఁ. సేసినాం. దొంగతనం . . . ఏం?
అబ్బులు: ఇది మాకు కొత్తేం కాదుగా!
భాస్కర్: కానీ, మీరు నాకు మాటిచ్చారు!
అబ్బులు: ( పెదవి విర్చి ) ప్చ్. ఆదా. . . అది పాత పాటే!
భాస్కర్: ఒట్టుకూడా వేశారు, గుర్తుందా?
సింహాద్రి: ఈ జానెడు పొట్టా ఆ ఒట్టుని పొట్ట బెట్టేసుకున్నాది!
భాస్కర్: ( అసహ్యంగా ) ఛీ. ఛీ! మీరు మనుషులేనా?
సింహాద్రి: ( చికాగ్గా ) కావంటావా? సరే నీ ఇట్టం. ఎలాగన్నా అనుకో! ఇప్పు డుపదేశాలు మొదలెట్టి, మమ్మల్ని మాత్రం పశువుల్ని సేయకు!
భాస్కర్: మీ కన్నా ఆవే నయం. చెబితే బుద్ధిగా వింటాయి!
అబ్బులు: ( కోపంగా ) ఏ పెహే యి పణుగుడు! కొత్త నోర్మూసుకుని పడుండ లేవటయ్యా!
భాస్కర్: అయినా, పోలీసులు ఊరుకోరుగా!
సింహాద్రి: ఆళ్ళ నెలా ఊరుకోబెట్టాలో మాకు తెల్సునేవయ్యా! ( విజిల్స్ శబ్దాలు దగ్గిరౌతూండగా, వాళ్ళిద్దరూ కంగారు పడ్డారు. )
అబ్బులు: ( బయటకు చూస్తూ ) మన సంగతి కేటి కానీ, ముందీ పర్స్ సంగతి సూడు, గురూ! ( లేడీ పర్స్ తీసి ఇచ్చాడు. )
సింహాద్రి: అవ్వరా!, దీ న్నెక్కడో కాడ దాసెయ్యాల. ( ఆలోచించి ) బాబూ! దీన్ని నీ కాడుంచు!
భాస్కర్: ( కళ్ళు చిట్లిస్తూ ) సింహాద్రీ! ఏమి టది?
సింహాద్రి: కనపట్టం నేదా, దబ్బరయ్యో, డబ్బు!
భాస్కర్: నా దగ్గిరెందుకు ఉంచడం?
సింహాద్రి: తరవాత సెప్తా గానీ, ముందుది లేసుకో!
అబ్బులు: ఇదిగో, అది మా కాడ ఉండకూడదయ్యా!
భాస్కర్: నో...నేను మిమ్మల్ని సమర్థించ లేను.
సింహాద్రి: ( కోపంగా ) ఏటయ్యా, ఏటి నువ్వు సేసేది? కాసేపు దాయమని బతిమలాడతాంటే అలా గింజుకు సత్తావేం?
భాస్కర్: మిమ్మల్ని మార్చాలని, మనుషులుగా చేయాలని ఆరుమాసాల నుండి ప్రయత్నిస్తూ వస్తున్నాను.
సింహాద్రి: ఆఁ. అయితే. . .
భాస్కర్: మీరు మారలేదు సరికదా, అర క్షణంలో నన్నూ దొంగగా మార్చేస్తున్నారు!
అబ్బులు: ఈ మాత్రం దానికే నువ్వు దొంగోడివి కావునేవయ్యా!
భాస్కర్: పర్స్ తీసుకుంటే మీతోపాటూ నేనూ ఒకణ్ణేగా!
సింహాద్రి: అదా నీ భయం! మరేం ఫర్లేదు. ఇదిగో, నువ్వు దొంగతనం సేసినావని అరిచ్చచ్చినా, ఎవులూ నమ్మరయ్యా!
అబ్బులు: నువు మంచోడివి!
సింహాద్రి: కావా. . .
భాస్కర్: అందుకా నా దగ్గిర దాయడం?
అబ్బులు: మరెందు కనుకుంతన్నా వేటి?

( దగ్గరైన విజిల్స్ శబ్దాలు హఠాత్తుగా ఆగిపోగా, అదే క్షణంలో సత్రం వీధి తలుపు చప్పుడైంది. అందరూ ఉలిక్కి పడ్డారు. )

## పాత్రలు

భాస్కర్
సింహాద్రి
అబ్బులు
విర్మల

సింహాద్రి: ( బెదురుతూనే బతిమాలాడు ) బాబూ! ఈ ఒక్కసారికేనయ్యా! ఊఁ. తీసుకో! తీసుకోమంటోంటే? ( బలవంతంగా భాస్కర్ జేబులో పర్సు ఉంచాడు. )
అబ్బులు: (బయటకు పరిగెత్తి, అదే వేగంతో వెనక్కి వచ్చి) గురూ! గురూ! పోలీసోళ్ళు ఈ తలుపు తడుతూన్నారు. ఏం సేద్దాం?
సింహాద్రి: మరేం భయం నేదునేరా! ( దీమాగా పచార్లు చేసి టక్కున ఆగి భాస్కర్‌తో ) బాబూ! సు వ్వెళ్ళు!
భాస్కర్: ఎక్కడికి?
సింహాద్రి: తలుపు తియ్యడానికి!
భాస్కర్: ( ఆశ్చర్యంగా ) నేనా!
సింహాద్రి: ఊఁ. నువ్వే!
భాస్కర్: ఎందుకెళ్ళాలి?
సింహాద్రి: మా కోసం?
భాస్కర్: నా కేం అవసరం?




అబ్బులు: ఆరు మాసాల్నించి కలిసి ఉంటున్నాం. ఈ మాత్రం సాయం సేయ లేవటయ్యా?

భాస్కర్: నా మాట విననప్పుడు, మీకు నే నెందుకు సాయ పడాలి?

సింహాద్రి: బాబ్బాబు! నీ కాళ్ళట్టుకుంటావయ్యా. ఈ సారికి మా మాట కొట్టేయకుండా, ఏగిరం ఎల్లవయ్యా?

భాస్కర్: నేను వెళ్ళను!

సింహాద్రి: ఇదిగో...ఇక మాం సచ్చినా, దొంగతనాలు

భాస్కర్: నమ్మమంటారా?

అబ్బులు: సత్తె పెమానకంగా! ఎల్లవయ్యా, బాబూ!

భాస్కర్: సరే వెళతాను. వెళ్ళి ఏం చేయాలి?

సింహాద్రి: తలుపు తియ్యి.

అబ్బులు: ఎదురుగా పోలీసోళ్ళు అవుపిత్తారు.

సింహాద్రి: 'ఇద్దరు కేటుగాళ్ళు యిటొచ్చినారా'ని అడుగుతారు.

భాస్కర్: ఏమని చెప్పమంటారు?

అబ్బులు: అదీ తెల్దటయ్యా?

సింహాద్రి: లేరని ధైర్యంగా అబద్ధం ఆడెయ్యి!

భాస్కర్: ( సందేహంగా ) అయినా, వాళ్ళు లోని కొస్తామంటే. . .

సింహాద్రి: రారయ్యా! నీ మొగంలో నమ్మక ముంది. అది రానియ్యదు.

( భాస్కర్ వెళ్ళాడు. [illegible] చూశారు. రెండు క్షణాల అనంతరం, భాస్కర్ కవరు పట్టుకుని తిరిగి వచ్చాడు. )

సింహాద్రి: ( సంబరంగా ) ఎల్లిపోనారా?

భాస్కర్: వచ్చింది పోలీసులు కాదు.

అబ్బులు: కారా. . . మరెవులబ్బా?

భాస్కర్: పోస్ట్‌మాన్! ( కవరు చూపి ) నా కీ కవరు ఇవ్వడానికి వచ్చాడు.

అబ్బులు: సంపేడు పో!

సింహాద్రి: ఎవలొత్తే మా కేం కానీ, ఇయ్యాల్టికి బతికి బయట పడినాం. అబ్బులూ! పోలీసోళ్ళు రూటు మార్చేసి, మరో సోటికి పోయుంటారు.

అబ్బులు: ( పెదిమ విరిచాడు ) ప్చ్. పాపం!

సింహాద్రి: ( భాస్కర్‌తో ) బాబూ! ఏదయ్యా పర్సు? ( ఎగాదిగా చూడగా ) ఓయి విన్నేనయ్యా! ఇమ్మంటూంటే అలా నిలువడి పోతావేం? ( జేబులో చెయ్యి పెట్టి తనే పర్సు తీసుకున్నాడు. )

అబ్బులు: ( హేళనగా ) ఓ ఈ మాత్రం దానికె తెగ గింజుకు పోయావుకదయ్యా! ఇక నీ కుద్యోగం వత్తే ఎలా సేత్తావేటో గానీ. . .!

( సింహాద్రి డబ్బు లెక్క పెడుతూంటే, భాస్కర్ కవరు చించాడు. )

సింహాద్రి: ( లెక్క బెట్టి సంతోషంగా ) అబ్బులూ! ఇరవై [illegible] దొండ్రలా?

భాస్కర్: ( చదివి, నిట్టూరుస్తూ ) ఏముంది మామూలేగా! ఇంటర్వ్యూ.

అబ్బులు: వారం రోజుల్లా మారాజుల్లా ఒలి కెయ్యొచ్చు, గురువా?

భాస్కర్: రాని ఉద్యోగానికి రమ్మని ఆహ్వానం!

( వాళ్ళిద్దరి ఉత్సాహం పెచ్చు పెరగడంతో, భాస్కర్ నిరాశ నుండి తేరుకుని క్షణకాలం మౌనంగా చూశాడు. )

భాస్కర్: మీరు అవకాశం ఇమ్మని కోరారు. ఆఖరు సారిగా మిమ్మల్ని, మీ చర్యల్ని సమర్థించాను. ఇక నా మాట మీరు వినాలి!

అబ్బులు: ( విర్లక్ష్యంగా ) సూదాం. కంగారేం వొచ్చినాది?

భాస్కర్: ( ఖచ్చితంగా ) లేదు. మీరు మారాలి. మారి తీరాలి.!

సింహాద్రి: ( పెద్దగా నిట్టూర్చాడు ) నువు సొప్పేది బాగానే ఉందయ్యా! తొలీత నీ సంగతే సూడు. పెద్దగా సదివా నన్నావు! బుద్ధులేమో మంచియ్యే ఒంట బట్టించుకున్నావు! ఉద్యోగం వచ్చేత్తా దన్నావు. ఏదయ్యా. . . ఏది, ఎక్కడొచ్చిందని? పత్త దన్న ముక్క ఆర్నెల్ల నుంచి ఇనడం తప్పించి...

అబ్బులు: నీతి గీతి అంటూ రొద పెట్టే నీకు దార్లేనప్పుడు, మాం మారి సేసే దేమున్నాదయ్యా?

సింహాద్రి: సరే. ఓ పాలి నీ పోరు పడ్లేక మారినాం! మంచిగా బతకాలని సూసినాం!

అబ్బులు: సూత్తే మాత్రం మా కేం ఒరిగి పోనాదని, నీలా పత్తు లుండడం తప్పించి. . .

సింహాద్రి: నీ పిచ్చి కానీ, అస లీ పెపంచకంలో మంచనే దెక్కడుందయ్యా?

అబ్బులు: ఉంటే, నీ కుద్యోగమే వచ్చేది!

భాస్కర్: అలాగని?

అబ్బులు: మళ్ళీ మాం బండిని సైడేసేసినాం!

సింహాద్రి: ఇదిగో. నీకు గేపకం ఉన్నాదో నేదో గానీ, అయాల. . . సందకాడ నువు రోగంతో సావడానికి సిద్ధవ్వుతే నువు సొప్పిన మంచి దార్లో నడిచి, కాసిన్ని రంగు నీళ్ళుకూడా సంపాయించ లేకపోయాం కదయ్యా!

అబ్బులు: అందుకనే, పీడరుగారి జేబు కొట్టేసి డాక్టరుగోరి జేబులో పెట్టేసి నీకు మందిప్పించి వాం! మర్సిపోనావేటి?

భాస్కర్: లేదు. అందుకు నే నెంతో రుణపడి ఉన్నాను. నిజమే. . . నాకు చదువు ఉంది కాని, ఉద్యోగం లేదు. కనీసం కనీస అవసరాలకు సరిపడ్డ ఆధారం కూడా లేకపోయింది. ఈ స్థితి తాత్కాలికం! నా కా నమ్మకం ఉంది. మరి మీకో?

సింహాద్రి: బతుకుమీదే నేదు నమ్మకం!

భాస్కర్: ఆ నిరాశే పనికిరాదు. ఏది ఏమైనా నీతిగా సంపాదించిన ...

సింహాద్రి: రూపాయి లోనే ఇలువుందంటావు?

భాస్కర్: అవును.

సింహాద్రి: మంచిని కాపాడ్డం కోసం ఏమైనా సేయాలంటావు?

భాస్కర్: ఎస్.

అబ్బులు: అప్పుడే 'నానూ ఓ మడిసినని' సొప్పుకొనే హక్కుంట దంటావు?

భాస్కర్: అంతేగా!

సింహాద్రి: కట్టబడి ఓ పైసా సంపాయిత్తే. . .

అబ్బులు: అదే రూపాయికి దారి సూపుద్దంటావు.

భాస్కర్: ఖచ్చితంగా!

సింహాద్రి: ఇదిగో, ఈ సోది శానాసార్లిన్నాం.

భాస్కర్: అయినా, మీ బతుక్కి హక్కు లేదుగా! ఒప్పుకుంటారా?

సింహాద్రి: అయితే అవ్వచ్చు!

భాస్కర్: మీది సక్రమ సంపాదన కాదంటాను. కాదనగలరా?

సింహాద్రి: నీతులు సొప్పాలన్నా, పెద్ద మడుసుల్లా సెలామణి కావాలన్నా, సెడ్డని మంచిగా, పాపాన్ని పున్నెంగా మార్చుకోవాలన్నా. . .

భాస్కర్: డబ్బుండా లంటావ్, అంతేగా!

సింహాద్రి: అంతే, అది లేనప్పుడు. . .

అబ్బులు: మూతెండి పోద్ది, నీ లాగ!

భాస్కర్: అలాగని, చెడ్డే మంచి అనుకోవడం కేవలం మూర్ఖత్వం. సింహాద్రీ! నీ వాదం కాదన లేను. గతంలోని గాయాలు అటువంటివి. చేయని దొంగ తనానికి జవాబు దార్లై నువ్వూ, ఆకలికి ఆగలేక అబ్బులూ ఇలా బతకడం ప్రారంభించారు.

అబ్బులు: నాలుగు రోజు లాగితే, నువ్వూ మా కన్న దారుణంగానే తెగిత్తావు.

సింహాద్రి: మాటలు సొప్పడం ఎవురి కన్నా తేలికలే!

భాస్కర్: పట్టుదల ఉండాలే కాని, మనిషికి కాని దేం లేదు.

సింహాద్రి: ( ఉరిమి చూశాడు. ) అయితే, మాకు నేదంటావు పట్టుదల?

భాస్కర్: ఉందా?

సింహాద్రి: ఉంది.

భాస్కర్: ( గుంభనంగా నవ్వి ) మీకా. . . నో. . . లేదు.

సింహాద్రి: ( హఠాత్తుగా ఆవేశపడిపోతూ ) ఉందంటుంటే. . . ఏం—సూపియ్యమంటావా?

భాస్కర్: మీ తరం కాదు.

సింహాద్రి: బాబూ! ఈడి సంగతి నీ కింకా తెల్దు!

భాస్కర్: ఆరు మాసాల్నించి బాగా తెల్సు!

సింహాద్రి: ఇదిగో, నన్ను రెచ్చ గొట్టకు!

భాస్కర్: ఏం, పౌరుషం వచ్చిందా? కుక్క తోక ఎప్పుడూ వంకరే!

సింహాద్రి: మావూ అంతేనంటావు?

భాస్కర్: ముమ్మాటికి!

సింహాద్రి: ( భరించలేకపోతూ ) ఏం పందెం ఏత్తావేటి?

భాస్కర్: మీరు నిలబడ లేరు.

సింహాద్రి: అదే సూద్దుగాని!

భాస్కర్: అక్కర్లేదు. ఏదో ఆవేశం కొద్దీ అంటున్నారు కానీ. . .

సింహాద్రి: అనడవే కాదు! నిలబడతాను. ఏరా, అబ్బులూ!

అబ్బులు: గురూ, గురూ: మాటిచ్చేత్తన్నా వేటి?

సింహాద్రి: ఏం నీ కిట్టం నేదా?

అబ్బులు: ( తల గోక్కుంటూ ) అంత గమ్మున మారిపోతే ఎలాగాని? హాయిగా సుకాన్నున్న పేనాన్ని, కట్ట బెట్టుకోవలిసి వత్తదేమో?

సింహాద్రి: ఏమైనా కానీ, బాబుకి మనవంటే శానా తేలిగ్గా ఉన్నాదిరా!

అబ్బులు: అక్కడే పప్పులో కాలేశావు, గురూ! మంచిగా సాలితే మనం ఎలాగూ ఇనుకోవని, బా బిలా ఎత్తేసి నాడు. నిన్ను రెచ్చ గొట్టాడు. నీలో ఏడి పుట్టించేశాడు. ( భాస్కర్‌తో ) ఇదేవన్నా న్యాయంగా ఉన్నదిటయ్యా నీకు? నీ తిప్పలేవో నువు పడకుండా, మా గురించెందుకయ్యా నీకు బాధ? మాం మారితే నీ కొచ్చె లాబం ఏటయ్యా?

భాస్కర్: నే నేవీ ఆశించడం లేదు. కాకపోతే, ఇద్దర్నీ మనుషులుగా తీర్చేదిద్దానన్న తృప్తి కోసం!

సింహాద్రి: అంటే, మాం మడుసులం కాదా?

భాస్కర్: అవునో, కాదో మీరే తేల్చుకోండి!

సింహాద్రి: ( ఉక్రోషంగా ) అవునయ్యా. నువ్వే. . . నువ్వే మడిసివి! నీకే అన్నీ సాతవును. మాం...మా వొట్టి యెదవలం! మా వెందుకూ పనికిరాం. పనికి రావనేగా నీ తెగ నీల్గడు.

భాస్కర్: ఇంతకీ నీ ఉద్దేశ్యం ఏమిటి?

సింహాద్రి: సవాల్

అబ్బులు: గురూ. . . గురూ!

సింహాద్రి: నువ్వుండెహె! బాబూ! సరిగ్గా ఇనుకో—ఈ సివ్వాద్రిగాడు, వచ్చిన లచ్మీ నీడ ఒట్టేసి సొబుతూన్నాడు. ఈ డిక దొంగతనం సేయడు.

అబ్బులు: ఏటి, గురూ, అలా తొందర పడి పోతన్నావు?

సింహాద్రి: అంతేకాదు, ఈడు ఇయ్యాల నించి తాగడు.

అబ్బులు: శానా బాగున్నాది.

సింహాద్రి: సెడు తిరుగుళ్ళు మానేత్తాడు.

అబ్బులు: ( గుండెలు బాదుకున్నాడు. ) ఏ టీ అన్నేయం! నీకు కాని పిచ్చెక్కలే దేటి? దొంగతనం సేయవా?

సింహాద్రి: అవును.

అబ్బులు: తాగవా?

సింహాద్రి: దాని జోలి కెలితే చెప్పుచ్చు క్కొట్టు!

అబ్బులు: సెడు తిరుగుళ్ళు మానేత్తావా?

సింహాద్రి: సేత్తే, తల్లికి పోయినట్టే!

అబ్బులు: ఇయ్యేం సెడ్డబుద్దులు, ఓ యమ్మ నాకార్తల్లీ?

సింహాద్రి: ఆ తల్లి మీదే పేమాణం సేత్తన్నాను.

అబ్బులు: మ రెలా బతుకుదాం, గురూ?

సింహాద్రి: సావనైనా సత్తాను గానీ, నీమా నెత్తురూ లేని బతుకు బతక లేన్

( భాస్కర్‌తో ) బాబూ! ఇదిగో, ఇయ్యాల మాం కొట్టేసిన డబ్బుకూడా ముట్టుకోను. దీన్ని నీ కాడ ఉంచేసుకో!

భాస్కర్: నా దగ్గ రెందుకు, వద్దు!

అబ్బులు: పోనీ, నా కాడుండ మంతా వేటి?

సింహాద్రి: ఒరేయ్! తమాసి కాలు కాదురా? దీంట్లో పైసకూడా ముట్టడాని కీల్లేదు. ఏం, నా న్చెప్పినట్టు ఇంటావా, లేదా?

అబ్బులు: నాను కాదంతా వేటి కావి, ఉన్న పళంగా అన్నీ మావెయ్యా లంటే నా వల్లకాదు, గురువా!

సింహాద్రి: అబ్బులూ!

అబ్బులు: న వ్వలా ఇరుసుకు పడక. రేపట్నుంచయితే నీ యిట్టం! ఇయ్యాలకు మాత్రం సన్నొగ్గేయి! వాటు కొట్టేసి, ఏట పులావు తినేసి, అలా. . . అలా ఎల్లి రావాలని మా కోరిగ్గా ఉన్నాది, గురూ!



సింహాద్రి: నాబం లేదు, ఎల్లొద్దు!

అబ్బులు: గురూ. . . గురూ! నీ కాళ్ళట్టుకుంటాను కాదనకు.

సింహాద్రి: ఒరేయ్! నాను సెప్పాలకం సేపి నానురా!

భాస్కర్: ఈ ఒక్క రోజుకేగా, వెళ్ళనీయి! కావలిస్తే నువ్వూ. . .

సింహాద్రి: (అరిచాడు) ఆగు! ఆదు నూరవుగాక. ఈడి మాటకు తిరుగు లేదు.

అబ్బులు: మరి నాను బండిని స్పైడే సెయ్యనా, గురూ!

సింహాద్రి: సరే, ఎల్లు!

అబ్బులు: ఎటో, అంతా సినీమా కత లాగున్నాది. తల్లీ, మాకాల్తల్లీ! అన్నిటికీ నువ్వే ఉన్నావు. (వెళ్ళాడు.)

భాస్కర్: (అభినందిస్తూ) సింహాద్రీ! నీ నిర్ణయం చాలా బాగుంది. నీ మీద పూర్తి నమ్మకం ఏర్పడింది.

సింహాద్రి: సాలు. . . సాలు. నన్నింక పొగిడేయకయ్యా!

(బీడీ కాలుస్తూ దూరంగా పోయి కూర్చున్నాడు. భాస్కర్ క్షణం తటపటాయించి బయటకు వెళ్ళబోగా, సింహాద్రి పలకరించాడు.)

సింహాద్రి: నువ్వెక్కడి కేటి?

భాస్కర్: అలా పార్కు వరకూ వెళ్ళొద్దామని ...

సింహాద్రి: (వ్యంగ్యంగా నవ్వాడు.) ఎందుకూ? ఆడ కూకుండుండి తీరిగ్గా ఏడ్డానికా?

భాస్కర్: (తెల్లబోతూ) సింహాద్రీ!

సింహాద్రి: నాకు తెల్దు లేవయ్యా! ఇక్కడ మా గురించి, ఈలు సిక్కితే అక్కడ నీ గురించి ఏడుస్తుంటావు.

భాస్కర్: ఈ వాళ నిండుగా నవ్వుకుంటాను.

సింహాద్రి: కవరొచ్చినందుకా!

భాస్కర్: కాదు. మీరు మారుతున్నందుకు!

సింహాద్రి: అది సరే కాని, ఇంతకీ ఆ కవరేటయ్యా?

భాస్కర్: ఇంటర్వ్యూకి పిలుపు.

సింహాద్రి: అంటే ఉద్యోగం వచ్చేసినట్టేనా?

భాస్కర్: కవరొచ్చినంత త్వరగా ఉద్యోగాలు రావు.

సింహాద్రి: "రాదూ రాదూ" అని ఎల్లకుండగానే ఉంటే ఎలాగయ్యా! ఇదిగో, నువ్వు మాకు సెప్పడం కాదు; నాను నీకు సెబుతున్నాను. తప్పకుండా నువ్వెల్లాలి!

భాస్కర్: అలాగే!

సింహాద్రి: అయితే, ఈ పదీ పట్టుకెళ్ళి కడుపు నిండా తినేసి తీరిగ్గా కూకుని ఏడుత్తావో, నవ్వుకుంటావో—ఏదో నీ ఇష్టం వచ్చినట్టు చేసేసుకో! (పది ఇవ్వబోయాడు.)

భాస్కర్: నన్ను గేలి చేస్తున్నావా?

సింహాద్రి: చ. నీ పత్తుల్ని సూద్దేక పేమతో ఇత్తన్నానయ్యా! ఇందా తీసుకో!

భాస్కర్: నీ అభిమానానికి నా జోహార్లు. కాని, అది నా కక్కర్లేదు.

సింహాద్రి: ఏం?

భాస్కర్: అది దొంగ సొమ్ము. ఇలా పస్తులతో ఏస్తానైనా చస్తాను కానీ, ఆకలి కోసం ఆశయాల్ని చంపుకో లేను. (విసురుగా వెళ్ళిపోయాడు. సింహాద్రి నిర్ఘాంతపోయాడు.)

సింహాద్రి: (తెప్పరిల్లి) హూఁ. దొంగ సొమ్మట. దొంగ సొమ్ము. నానూ సూత్తా నీ సంగతేటో! నీ సెయ్యే ఎప్పుడూ పైనే ఉండాలంటావు కదూ! అదే నన్నియ్యాల పౌరుషం తెప్పించి నాది.

(బీడీ కాల్చుకుంటూ వరండాలో విసురుగా పచార్లు చేస్తుంటే, కొన్ని క్షణాల తరవాత సత్రం వెనకాల "కెవ్వు" మన్న స్త్రీ ఆర్తనాదం వినిపించింది. సింహాద్రి ఉలికిపాటుతో అటు చూశాడు. అంతలో "వదులు. నన్ను విడిచి పెట్టు" అన్న స్త్రీ కేకలు బిగ్గరగా వినిపించాయి. 'ఏటి, ఏటా కేకలు? సత్రం ఎనకాల ఏదో జరుగుతున్నట్టుందే!' అనుకుంటూ క్షణం తటపటాయించి, తిరిగి కేకలు వినిపించడంతో, వేగంగా కుడి ద్వారం గుండా సత్రం వెనక్కి పరుగెత్తాడు. రెండు క్షణాల తరవాత నాజూకైన యువతి, సూట్‌కేస్‌తో పరుగున వరండాలో కొచ్చింది. భయం తాలూకు చిహ్నాలు మోముతో కదలాడుతూండగా, ఆయాస పడుతూ వచ్చిన వైపే చూస్తూండిపోయింది. లోపల సింహాద్రి కేకలు, ఎవరి తోనో దెబ్బలాడుతూన్న శబ్దాలు కాసేపు వినిపించాయి. "హమ్మయ్య" అంటూ యువతి తేలిక పడుతూండగా, ఒళ్ళు విరుచుకుంటూ సింహాద్రి వచ్చాడు.)

సింహాద్రి: అప్పలస్వామట. . . అప్పలస్వామి! ఈడి పేరు సెబితే ఒలు పేనంతా దడదడ్లాడి పోతాదట! నా కాడ ఏసా లేద్దామనుకున్నాడు. వెధవ నా కొడుకని. . . యెదవ నా కొడుకు!

యువతి: సమయానికి దేవుడిలా వచ్చి ఆదుకున్నారు. మీరు రాకపోతే నా బతుకే నాశనం అయేది! (సింహాద్రి తేరపారి చూస్తుండగా కాస్త కలవర పాటుతో) అదేమిటి? అలా చూస్తున్నారేం?

సింహాద్రి: (తెప్పరిల్లి) ఏం లేదు. నువ్వు డేటనుకుంటన్నావు?

యువతి: ఇక ఏ భయానికి తావు లేదని ధైర్య పడుతున్నాను. మీ సహాయానికి నా థాంక్స్!

సింహాద్రి: (ఓరగా చూస్తూ) నిన్నిప్పుడు కాపాడిం దెందుకో తెలుసా?

యువతి: తెలీదు! (యథాలాపంగా అనేసి అతన్ని పరీక్షించి) తెలుసు. తెలుసండీ.

సింహాద్రి: (ఆశ్చర్యపోయాడు.) తెలుసా! ఎలా?

యువతి: మీ ముఖం చెబుతూంది.

సింహాద్రి: (మరింత ఆశ్చర్యంగా) ఆఁ. నా మొగం సెప్పిందా! (గంభీరంగా) ఏమని సెప్పినాదేం?

యువతి: చాలా మంచివారని.

సింహాద్రి: (తీయని మాటలకు ఒళ్ళు జలదరించి, మనసు పులకించగా అవ్యక్తమైన అనుభూతి పొందుతూ, పైకి వ్యక్తం కానీయని స్వరంతో) ఇదిగో నీ తెలివంతా కుమ్మరించి, నాకు ఎగ్గా లేద్దామనుకోకు. నాను నా నా రౌడీగో డంత సన్నాసోడ్ని గాను!

యువతి: అందుకే మంచి వారంటున్నాను.

సింహాద్రి: సు వ్వనుకోగానే సరిపోదేటి?

యువతి: (క్షణం ఆలోచించి) మీ రెందుకో కాని, నటిస్తున్నారు. నన్ను భయ పెట్టాలని తాపత్రయ పడుతున్నారు. అయినా. . . నాకు తెలుసు, మీరు నా కేం హాని చెయ్యరని. . .!

సింహాద్రి: (ఆమె తెలివికి విస్తుపోతూ) మాటలతో ఎన్ని పల్టీలు కొట్టించకు.

యువతి: అంత ఖర్మ నాకు పట్టలేదు. ఆడదానికి ప్రత్యేకమైన శక్తి ఒకటుంది. అదేమిటంటే ఒకసారి మాటిగా మగాడి కళ్ళల్లోకి చూడగలిగితే. . .

సింహాద్రి: ఆఁ. మాత్తే. . .

యువతి: అతని స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకో గలదు. నిజానికి మీలో ఏ తప్పుడు ఉద్దేశ్యం ఉన్నా, మీ రింత సేపు సావధానంగా మాట్లాడరు.

సింహాద్రి: ఆహా! ము రా రౌడీగోడి కళ్ళల్లోకి సూసినావా?

యువతి: చూడనక్కర్లేకుండగానే తెలిసి పోయాడు.

సింహాద్రి: (అభిమానమో, వ్యంగ్యమో తెలీని నవ్వుతో) ఊఁ. శానా తెలివైన దానిలా గున్నావే! ఇంతకీ నా నెవరనుకున్నావు?

యువతి: రౌడీయా?

సింహాద్రి: ఓ్రలడీగా!

యువతి: గజదొంగా?

సింహాద్రి: మారాజులా! అంతేకాదు, నీ లాటి పిల్లలతో ఆటలాడుకునే మొనగాడ్ని!

యువతి: (నవ్వింది అదోలా) కావచ్చు! కాని, రౌడీకికూడా విచక్షణా జ్ఞానం ఉంటుంది. దొంగకుకూడా మనసుంటుంది. ఎన్నో తప్పుడు పనులు చేసే మొనగాడుకూడా, చెల్లెలి విషయంలో ఎంతో ప్రేమ చూపుతాడు. కాదంటావా?

సింహాద్రి: (నిర్మలంగా నవ్వేశాడు.) అయితే, నువ్వు నాకు సెల్లెమ్మ నంటావ్?

యువతి: మీకేమైనా అభ్యంతరమా!

సింహాద్రి: (నటన మాని ఆప్యాయంగా చూస్తాడు.) మొత్తానికి శానా గడుసు దానివే! నా నేదో నిన్ను బెదిరిద్దామనుకుంటే, మాటకు దొరక్కుండా వరస కలిపి, గుండెతట్టి అన్నయ్యని సేసేసినావు. బాగుందమ్మా, శానా బాగుంది. ఇంత తెలివైన దానివి, ఆ రౌడీగోడి కెలా సిక్కినావు, సెల్లెమ్మా.

యువతి: ఇంట్లో రౌడీల్ని తప్పించుకునే ప్రయత్నంలో అనుకోకుండా పిడికి చిక్కాను.

సింహాద్రి: ఇంట్లో రౌడీలా?

యువతి: అవు నన్నయ్యా! తల్లిదండ్రులు లేని నన్ను—పెంచి పెద్ద చేసిన మేనమామే రౌడీ కన్నా దారుణంగా ప్రవర్తించబోతే నే నేం చేయాలి?

సింహాద్రి: ఆణ్ని సంపి పాతరెయ్యాలి!

యువతి: చంపే ధైర్యం, చచ్చే పిరికితనం— ఈ రెండూ నాకు లేకపోయాయి. విరక్తితో ఇల్లు విడిచి ధైర్యంగా బయటకు అడుగు పెట్టాను. అదేం ఖర్మో కానీ, తీసుకొచ్చిన డబ్బంతా రైల్వే స్టేషన్‌లో పోగొట్టుకున్నాను

సింహాద్రి: రైలు స్టేషనులో డబ్బు పోనాదా? ఎప్పుడు?

యువతి: ఈ సాయంకాలమే!

సింహాద్రి: ఎంతేటి?

యువతి: సుమారుగా, ఇరవై తక్కువ ఐదొంద లుండొచ్చు!

. . .!

యువతి: (ఆశ్చర్యంగా) కరెక్టు. నేనే! మా వాళ్ళకు కనపడకుండా ముసుగేసుకున్నాను. అవునూ. . . ఇంత ఖచ్చితంగా చెబుతూన్నావు. నీ కెలా తెలుసు? నువు కానీ చూశావా?

సింహాద్రి: ( పర్స్ చూపుతూ ) ఈ పర్స్ నీదే నామ్మా?




లింటాస్-ESB.ST.3-140 TL

యువతి: అవే. . . నాదే! నీ దగ్గిరి కెలా వచ్చింది? దొరికిందా?

సింహాద్రి: ( సిగ్గు పడిపోతూ ) దొంగోళ్ళకు దొరకదమ్మా!

యువతి: ( విషయం గ్రహించి ) పోన్లే! నా కంటే నా డబ్బునే ముందుగా కాపాడి అన్నయ్య వనిపించుకున్నావు. బాధ పడ కన్నయ్యా!

సింహాద్రి: ( విల విల లాడిపోతూ ) నీ మంచి మనసుతో ఈ యెదవని ఇంకా సంపకమ్మా! ఛ. ఎంత పని సేసినాను. సేసింది తలుసుకుంటూ ంటే, అసహ్యం పుట్టుకొత్తాంది.

యువతి: అన్నయ్యా! నీలో ఇంతటి విచక్షణా జ్ఞానం ఉండికూడా. . .

సింహాద్రి: ఈ దొంగ పను లెలా సేతన్నావంటావ. మంచీ చెడ్డా, పాపం పున్నెం బాధ అన్నేయం. . . ఏవీ ఎరగని మాకు, మా బతు కెటువంటిదో తెలి సొచ్చింది ఇయ్యాలనెమ్మా! అదీ బాబూ దయవల్ల...

యువతి: ఆయ నెవరు?

సింహాద్రి: ఓ మంచోడు. తల దాచుకోవడానికంటూ ఆర్నెల్ల క్రితం ఈ వత్రానికొచ్చినాడమ్మా! మాం. . . మా వంటే, నానూ అబ్బులుగాడు మాం ఇద్దరం దొంగోళ్ళమని తెలిసికూడా మాతో నేత్తం సేసినాడమ్మా! మమ్మల్ని మార్చడానికి తెగ గింజుకుని, నాబం నేకపోగా ఇనుగెత్తి, మీరు మారలేకుంటూ ఈసడించుకున్నాడమ్మా. ఆ ఈసడింపు సహించనేక పోయినాను. నాకూ పౌరుషం వచ్చినాది. ఇకనుంచి సెయ్యం అంటూ పంతం పుట్టినాం. ఆఖరుకు ఈ డబ్బులో పైసాకూడా ముట్టబోవని ఒట్టేసినాం!

యువతి: ఆయ నేం జేస్తున్నారు?

సింహాద్రి: పత్తులుంటున్నాడు. . . ఒంతేనమ్మా! సదువు పెద్దదే కానీ. . .

యువతి: ఉద్యోగం లేదా?

సింహాద్రి: ఇంట్లోనే కూకుడుంటే ఎలా దొరుకుద్దమ్మా! అంతా బాగానే ఉన్నాది కానీ, ఆయనలో సిన్న జబ్బుందమ్మా! మా కెన్నో నీతులు సెప్తాడ, మరి ఆయన కాయన ఏవీ సెప్పుకో లేడమ్మా! దిగులుగా, ఏదో ఏదో ఆలోసించేత్తుంటాడమ్మా! కొత్త ధైర్యంగా ఉండవయ్యా అంటె, ఇనిపించుకోడే. పోనీ ఉద్యోగానికి పిలు పొచ్చి రాదే అనుకో ఎల్తాడంటా. అహా... అదీ నేదు. మాంగానీ నిలదిత్తే, అది వొచ్చేది కాదంటాడు.

యువతి: ఇంతకీ ఆయ నేరి? సింహాద్రి: సికారెల్లాడు. సికారు.

యువతి: మరి ఈ డబ్బు ముట్టుకో నన్నావు. ఏం చేద్దా మనుకున్నావ్?

సింహాద్రి: ( సాలోచనగా ) బాబు కియ్యబోతే వద్దన్నాడా? అబ్బులుగా డియ్య మన్నా నా నియ్య లేదు. నా నేం సేద్దా మనుకున్నా నంటే. . . అనుకో డానికేటుంది కానీ, నువ్వచ్చినావుగా, నీకే ఇచ్చేత్తాను. తీసుకో, సెల్లెమ్మా! ( పర్స్ ఇచ్చాడు. )

యువతి: నేను రాకపోతే ఏం చేసేవాడివి?

సింహాద్రి: భద్రంగా దాసి ఉంచెవాడ్ని! అమ్మా! మంచితనం మా పెద్దదమ్మా! ఏటో నా కియ్యాల అంతా ఇసిత్రంగా ఉన్నాది. నా నీ డబ్బు కొట్టెయ్యడమేటి? బాబుతో పంతం పట్టడం ఏటి? నువు నా సమ్మంలోకి రాడం ఏటి? అన్నయ్య అని పిలడం ఏటి? ( కాస్తాగి ) ఎరే నాసి, అసలు ని వెక్కడి కెడదామని ఇళ్ళిడిశావ్?

యువతి. నాకే తెలియద.

సింహాద్రి: మరి ఈ అన్నయ్య దగ్గిరుండి పోతావేటి? యువతి. ఇక్కడా?

సింహాద్రి: ఇక్కడ్నే! నా కాడె! ఏం. . .? ఇది సందేహం ఆలోచించకు. నువ్వుండి పోవాలి! నువ్వు 'అన్నయ్యా' అన్నప్పుడే. . . నా కేటో. నా కేటో. నా నం సెప్పలేను గానీ. . .

యువతి: ఉండి పోవాలంటావ!

సింహాద్రి: అది! ఇదిగో, నా పేనంలో పేనంగా సూసుకుంతాను. ( ఆమె ఆలోచన గమనించి ) ఏం, నీ కిట్టం నేదా?

యువతి: గమ్యం తెలియని గమనంలో ఇదో మజిలి. సరే ఉంటాను.

సింహాద్రి: మా బాగు! ఈడి మాటన్నావు. నా కంతే చాలు. అదే పదేలు. రామ్మా. రా. ( ఎడమ గది చూపుతూ ) ఇదిగో, ఇదే మన గది ( కుడి గది చూపుతూ ) అదేమో బాబుది. ఈ మంచం మీద కూకుని ఉండు. నాను వొంటేలు కెల్లి సిటికెలో అన్నం తీసుకొత్తాను. ఎప్పుడు తిన్నా వేటో కానీ! ( ఆమె సమాధానం కోసం ఎదురు చూడకుండా రెండడుగులు వేసి టక్కున ఆగి ) సెల్లెమ్మా! నా పేరు సింహాద్రి. మరి నీ పేరు?

యువతి: నిర్మల.

సింహాద్రి: ఆహా. . . ని. . . ర. . .మ. . .ల! ఏం సక్కని పేరు ( అనుకుంటూనే సింహాద్రి వెళ్ళాడు. నిర్మల ఎడమ గదిలోకి వెళ్ళి కాస్సేపట్లో తిరిగి వచ్చి, కుడి గదికి వెళ్ళింది. ఇంతలో బయట నుండి భాస్కర్ చేయి పట్టుకుని సింహాద్రి లాక్కువచ్చాడు విసురుగా )

సింహాద్రి: రా. రా, బాబూ, సూద్దూ కాని ( నిర్మల కనిపించకపోగా పిల్చాడు ) సెల్లెమ్మా. సెల్లెమ్మా! ( నిర్మల వచ్చింది. ) అదిగో సెల్లెమ్మ! ( నిర్మలతో ) మరేం సెల్లెమ్మా, ఈయనే భాస్కరం బాబంటే! ( ఇద్దరూ నమస్కారాలు చేసుకున్నారు ) బాబూ, సెల్లెమ్మ ఇక ఇక్కడ్నే ఉండిపోద్ది. నానే ఉండి పొమ్మన్నాను. ( సగర్వంగా చెప్పాడు. )

భాస్కర్: ( సింహాద్రి భుజం తట్టి ) నిన్నెలా అభినందించాలో తెలియడం లేదు, సింహాద్రి! నా ఆశల్ని అధిగమించావు. మానవత్వం మూర్తీభవించిన మనిషిగా నువు ఎదిగి పోయావు. ( అభినందనకు అంత మనిషీ సిగ్గుతో మెలికలు తిరిగాడు. )

సింహాద్రి: సూడమ్మా. బాబెలా పొగిడేత్తన్నాడో! నా నేం గొప్ప పని సేసినాను! ( ప్రస్తావన మార్చే ఉద్దేశ్యంతో ) సరే. మీరు మాటాడుతూండండి. నాను అన్నం పట్టుకొత్తాను. మరిసిపోనాను. అబ్బులుగా డొచ్చినాడా? ( నాలిక కరుచుకుని ) నిజంగా నాకు మతే పోనాది. ఆ డొత్తే కనపడకుండా ఉంటాడా! ( అంటూ వెళ్ళాడు, భాస్కర్. నిర్మల క్షణ కాలం మౌనంగా ఉండిపోయారు. )

నిర్మల: ( తేరుకుంటూ ) నా పేరు నిర్మల. . . పోతే. . .

భాస్కర్: సింహాద్రి అంతా చెప్పాడు.

నిర్మల: మీ గురించికూడా విన్నాను.

భాస్కర్: పోన్లెండి శ్రమ తగ్గించారు. ( తడబడుతూ చెప్పాడు. )

నిర్మల: ( అతని ఇబ్బంది గమనిస్తూ ) మీ రెందుకో ఫీలవుతున్నట్టున్నారు?

భాస్కర్: అబ్బె. నేను. నే నేం ఫీలవడం లేదు!

నిర్మల: ఒక వేళ అనుమతి లేకుండా చొరవగా మీ గది లోకి వెళ్ళినందుకు?

భాస్కర్: దానికేముంది. అయినా, ఆ గదిలో మీరు చూడాలిసిందేముంది గనక.

నిర్మల: లేదనే అనుకుంటున్నారా?

భాస్కర్: ఏముందబ్బా! పాత పెట్టె, చింకి చాప, మాసిన బట్టలు. . .

నిర్మల: చినిగిన దుప్పటి! ఇలా మిమ్మల్ని మీరే చిన్న బుచ్చుకుంటున్నా రన్న మాట. వస్తువులు కాదండీ ప్రధానం?

భాస్కర్: మరి? నిర్మల: వ్యక్తులు!

భాస్కర్: అంటే నన్ను పరికించాలని వెళ్ళారా? సారీ, నే నంత అందగాణ్ణి కాను!

నిర్మల: కాని, వ్యక్తిత్వం సంగతి మరిచిపోయారు. మంచిగంధం అడవిలో ఉన్నా సువాసనలు వెదజల్లదా! అన్నయ్య లోని మార్పుకు నా శీలం రక్షించబడే ప్రయత్నానికి మౌలికమైంది మీ వ్యక్తిత్వమే! దాని ప్రభావం లేనినాడు, అన్నయ్య మనిషే కాడు. నేను బతికే ఉండనీ. మీకు నా థాంక్స్!

భాస్కర్: మీ రెదో లేని పోని గొప్పదనాన్ని నా కంట గట్టేస్తున్నారు. మనిషిగా నా ప్రయత్నం చేశానంతే!

నిర్మల: దాన్నే మానవత అంటారు. అయినా, గొప్పవాళ్ళు పొగడ్తలకి సిగ్గుపడటం సహజమే!

భాస్కర్: మీరు చాలా తమాషాగా మాట్లాడుతున్నారే!

నిర్మల: అదే నా ఆయుధం. అయినా, మనసు విప్పి మాట్లాడినదే ఇక్కడ్నా నా మాటల్ని అతిశయోక్తులుగా భావిస్తే. . .

భాస్కర్: అహా. అదేం లేదు.

నిర్మల: పోన్లెండి. నన్ను త్వరగానే అర్థం చేసుకున్నారు. ( క్షణం ఆగి ) ఎది మందిని బాగు చేస్తూ, తను బాగు పడ్డం కొందరి తత్వాలయితే, చెప్పిందొక్కటి లాంటి తత్వాలు కొందరివి!

భాస్కర్: ఈ సూచన నాకే అనుకుంటాను!

నిర్మల: అర్థమయిం దనుకుంటాను.

భాస్కర్: నన్నూ మార్చేద్దామనా, మీ ఉద్దేశ్యం?

నిర్మల: ( ఆశ్చర్యంగా ) ఏమిటీ. . . అంతటి సదవకాశం నాకు లభించదమే! థాంక్స్, బాబూ, థాంక్స్!

భాస్కర్: ( అర్థంకాని ఇబ్బంది పడుతూ ) సరే. మీరు కాస్త విశ్రాంతి తీసుకోండి. నేను కాస్త మొహం కడుక్కుని వస్తాను.

(సశేషం)

నాటిక

# గ్రహణం

— డి. నారాయణవర్మ

## పాత్రలు

భాస్కర్
సింహాద్రి
అబ్బులు
నిర్మల

(క్రిందటి సంచిక తరువాయి)

( భాస్కర్ వెళ్ళాడు. నిర్మల అటే చూస్తూ తీయగా నవ్వుకుంటూ, సూట్‌కేస్ తీసుకుని ఎడమ గదిలోకి వెళ్ళబోతూండగా "అబ్బుల్మా రాజుకీ", "అబ్బుల్మారాజుకీ" అన్న కేకలు వినిపించాయి. నిర్మల ఆగి బయటకు చూసింది.)

నిర్మల: అబ్బులు వస్తున్నాడన్నమాట! అదేమిటి. మనిషలా తూలి పోతున్నాడు? పోతే, ఇత నెలాంటి వాడో తెలుసుకోవాలి. ( సూట్‌కేస్ తీసుకుని లోపలికి వెళ్ళింది. అబ్బులు తూలుకుంటూ, కేకలు వేసుకుంటూ వచ్చాడు. )

అబ్బులు: అబ్బుల్మారాజుకీ! అబ్బుల్మారాజుకీ! అబ్బుగాడికీ! ( తక్కున ఆగి ) ఏటే, వాకు నావనుకోడవే కాని, ఎనక మాలెవులా జై కొట్టరేటే? నానంటే ఏటనుకొంతన్నారు? పెద్దోళ్ళ కైతే, మాసక్కా కొడ్తారు గావి. . . మక్కేసుకున్న-సుక్కంటే మామూలు సుక్కా...ఆఁ మరే, గవుర్నమెంటు సారా*ఏసుకున్న ఈడికి జై కొట్టరేటెహె! గవర్నమెంటు సారా తాగి ఎందుకు, నానూ గవుర్నిమెంటునే! అందుకవీ నాకు జై కొట్టాల. ఆఁ ఇదిగో, సూస్కోండి. . . అనేత్తన్నా! "అబ్బుల్మారాజుకీ"

నిర్మల: ( వచ్చి వెనక నిలబడి ) "జై."

అబ్బులు: అదీ సెక్క! ఇల్లా. "అబ్బుల్మారాజు కీ..."

నిర్మల: "జై!"

అబ్బులు: మా సక్కా ఉందొరస. "అబ్బుగాడికీ..."

నిర్మల: "జై."

అబ్బులు: (హుషారెక్కిపోయాడు) ఆఁ ఇదిగో, వాను పదం పాడేత్తన్నా! నా ఎనకాల వంత పాడెయ్యాల. తెలిసినాదా? ఇదిగో, పాడేత్తన్నా! (గొంతు సర్దుకుని పాడాడు. )

"సందకాడే సందమామా ఎదురొచ్చినాదీ"

నిర్మల: ( వంత పాడింది ) "ఎదురొచ్చినాదీ!"

అబ్బులు: ( నోటితో తాళం కొడుతూ ఎగురుతూ, ) అద్గదీ. . .

"సందులోనా సుందరమ్మా సెయి నొక్కినాదీ"

నిర్మల: "సెయి నొక్కినాదీ!"

అబ్బులు: ( ఒళ్ళు మరిచి ఎగురుతూ ) వారేవా! "మాపిటేళా గంబరమ్మా మందు కొట్టినాదీ!"

నిర్మల: ఛఛా! ఏమి టా వెధవ పాటా నువ్వూనూ!

అబ్బులు: ( నిలబడి గుడ్లెర్ర జేసి ) ఆఁ.. . ఏటీ. . . ఛ. ఛా! నాను పాడేది ఎదవ పాటా! ఎదవ పాట నాను పాడతన్నానా! అంటే నానూ ఎదవనేగా! ఏయ్, ఇదిగో, ఈ పాట సంగతి తెల్సాని? అహాఁ తెల్సాని? ఓ దరమరాజు-కలిపెబువు... కాదు. కాదు, ఓ దరమ పెబువు—కవిమారాజు పీకల్దాకా మందు కొట్టేసి సారా కొట్టుకాణ్ణే కూకుండి పోయి రాసేసినా డీ పాట! దీన్ని మందు కొట్టినోడే పాడాల్ట! అలా పాడితేనే, సొగసుట. . . సొగసు! ఇంత బెరమాండమైన పాట నట్టుకుని ఎదవదంతావా! హమ్మ. హమ్మా, రాసినోడికి, పాడినోడికి, మా సెడ్డ వుమానమే! ముందు లెంప లేసుకో! ఏసుకో మంతాంటే. . .!

నిర్మల: వేసుకోకపోతే!

అబ్బులు: ఏటీ. నన్నే ఎదిరిత్తావా? (వెనక్కి తిరిగి చూసి) ఎవుర్రా నువ్వు?

నిర్మల: నువ్వెవరింతకీ?



అబ్బులు: ఏటే, నా నెవుర్నా? నా గుమ్మంలో నిలబడి, నా నెవుర్నని నిందిత్తావా! సాబుతా. సాబుతా! ఈడి సంగతి నీ కింకా తెల్దు కాబోలు!

నిర్మల: ఏం, నీ కూ తన్నులు కావాలా?

అబ్బులు: నీ దగ్గిర రడీగా ఉన్నాయేటి?

నిర్మల: ఓ, సింహాద్రి అన్నయ్య వస్తే కావలిసివ్వొ!

అబ్బులు: ( ఎగిరి గంతేశాడు ) ఎవు డా ఎదవ! దమ్ముంటే రమ్మను. ఆహా, రమ్మను సూదాం! మాటలు మా పొగరు మోత్తనంగా ఉన్నాయే! బండి నెక్కడ పైడేసినావేటి?

నిర్మల: ఇక్కడే!

అబ్బులు: ఇక్కడ్నా? ఎందుకేటి?

నిర్మల: అబ్బులు మా రాజా దగ్గిర దొంగతనం నేర్చుకుందామని.

అబ్బులు: ఏటే కూత్తన్నావు? నాను, నా వేం దొంగ ననుకుంతన్నావా?

నిర్మల: కాదా?

అబ్బులు: సారా సొక్కిగా కాదు.

నిర్మల: ఏం, బండ్లి పైడేసిందా?

భాస్కర్: ( నవ్వుతూ ) బాగా అడిగారు. ( నిర్మల నవ్వింది. అబ్బులు తెల్లబోయి నీళ్ళు నములుతూండగా ) చెప్పబోయి, అబ్బులూ, సమాధానం?

అబ్బులు: ( దిగులుగా ) ఇంకేం సొప్పను. దార్లో గురువగ పడి, సెల్లెమ్మ తెలివి గురించి పెద్దగా సొప్పేత్తాంటే అదేటో మూద్దా ననుకున్నాను. అను కుంటే. . .

భాస్కర్: తిరిగి నువ్వే బోల్తా పడ్డావు.

నిర్మల: ( నవ్వుతూ ) నువ్వు నటిస్తున్నట్టు మొదటే అర్థమయింది.

అబ్బులు: అమ్మో. అమ్మో! నీతో మాట్టాడ్డం నా తరం కాదు, సెల్లెమ్మో!

సింహాద్రి: ( వచ్చి నిర్మల కాళ్ళమీద పడ్డ అబ్బుల్ని చూసి ) ఆఖరు కేవయినాదిరా? లేరా. లే! ( లేచాడు ) సెల్లెమ్మంటే ఏటను కుంటన్నావు? ఇదిగో అవులిత్తే పేగులు నెక్కపెట్టేత్తది. జాగ్రత్త! ( నిర్మలతో ) రా అమ్మా! అన్నం తెచ్చినా, తిందూగాని.

నిర్మల: ( అన్నం పొట్లం చూసి ) ఇదంతా నాకే! ( క్షణం భాస్కర్‌ని చూసి ) మీరుకూడా రండి, బాబూ!

భాస్కర్: ( ఆశ్చర్యపడుతూ ) నేనా, ఎందుకూ?

నిర్మల: కాస్త మీరూ తిందురు కాని.

భాస్కర్: ( నసుగుతూ ) నేను...నేను భోజనం చేసే వచ్చాను.

సింహాద్రి: నమ్మకు, సెల్లెమ్మా! అదంతా వట్టిది. ఆయ నెప్పుడూ ఇలాగే అంటూంటాడు.

అబ్బులు: బాబూ! సెల్లెమ్మ కాడ ఏసా లేయకు. అవులిత్తే పేగులు నెక్కపెట్టడమే గాదు—అవులించకుండానే నీ పేగుల సంగతి తెలిసేసుకున్నాది.

నిర్మల: రండి, ప్లీజ్!

సింహాద్రి: కదలవయ్యా!

అబ్బులు: ఎల్లవయ్యా, బాబూ!

నిర్మల: ఇంతమంది కోరుతూంటే, కాదనడం మీకు భావ్యం కాదు.

భాస్కర్: సరే, అలాగే!

సింహాద్రి: బాబుకీ...

అబ్బులు: "జై"

సింహాద్రి: సెల్లెమ్మకీ...

అబ్బులు: "జై"

నిర్మల: ( వాళ్ళని వారిస్తూ ) నాదో చిన్న కోరిక! ముందు వెనుకల లేడాలో అందరం విచిత్రంగా కలుసుకున్నాం! ఇకనుంచి మనమంతా ఒక కుటుంబంలా కలిసి ఉందాం. ఏమంటారు?

( అందరూ సమ్మతిని తెలియబరుచుతూండగా లైట్లు ఆరిపోయాయి. )

## 2

( తిరిగి వెంటనే లైట్లు వెలిగాయి. రెండు రోజులు గతించాయి. వరండాలో మార్పేం లేదు. మూడో రోజు మధ్యాహ్నం వేళ, ఎడమ గదిలో సింహాద్రి, అబ్బులు భోజనాలు చేస్తూ అస్పష్టంగా గొడవ చేస్తున్నారు. నిర్మల వరండాలో ఉన్న నులక మంచం కాళ్ళ కట్లుతాడు బిగిస్తూంది. )



నిర్మల: ( కేకగా ) ఏమిటి, ఏమి టా గోల? బుద్ధిగా అన్నం తింటారా, లేదా? ( క్షణం నిశ్శబ్దమై, తిరిగి వాదులాట వినిపించగా ) ఇదిగో, మీకే చెబుతూంట! ఈ సారి గానీ గోల వినిపించిందా, ఇద్దరూ గుంజీలు తీయాల్సి వస్తుంది—జాగ్రత్త! ( గొడవ చల్లారింది. అంతలో భాస్కర్ బయట నుండి వచ్చాడు. చేతిలోని ఫైల్ మంచం మీద పడేసి, పెద్దగా నిట్టూరుస్తూ మొగానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. పని ముగించి నిర్మల దగ్గిరగా వచ్చింది. )

నిర్మల: రండి. మీ కోసమే ఎదురు చూస్తున్నాను. ( మొగం పరికించి ) అదేమిటి, అలా ఉన్నారు?

భాస్కర్: ( పేలవంగా నవ్వాడు. ) ఎలా ఉన్నాను?

నిర్మల: మొగం వాడిపోయి, చాలా నీరసంగా కనిపిస్తున్నారు. ఎండ దెబ్బ తిన్నారా?

భాస్కర్: ( మరో సారి నవ్వుతూ ) ఎదురుదెబ్బ తిన్నాను.

నిర్మల: ( క్షణ కాలం తెల్లబోయి, నెమ్మదిగా ) ఎక్కడికి వెళ్ళా రేమిటి?

భాస్కర్: ఎక్కడకు వెళ్ళినా కాళ్ళు పీకెగనీ. . . నో యూజ్!

నిర్మల: ఇంటర్వ్యూ ఎప్పుడు?

భాస్కర్: రేపు పది గంటలకి!

నిర్మల: సరే, బాగా పొద్దెక్కింది. కాళ్ళు కడుక్కుని రండి. భోజనం చేద్దురు కాని.
భాస్కర్: ఊహుఁ, వద్దు.
నిర్మల: ఏం?
భాస్కర్: ఆకలిగా లేదు. ( ఫైల్ తీసుకుని నీరసంగా అడుగులు వేసుకుంటూ గదికి వెళ్ళిపోయాడు. అతని ప్రవర్తనకు నిర్మల మరోసారి తెల్ల బోతూండగా సింహాద్రి, అబ్బులు వచ్చారు గదిలోంచి. )
నిర్మల: ( తేప్పరిల్లుతూ ) తినడం పూర్తయిందా?
అబ్బులు: ( భారంగా ) ఓ...అయివాది.
సింహాద్రి: ( తేన్పుతూ ) మువ్వొంకాయకూర శానా బాగ వండినావమ్మా!
నిర్మల: అది సరే, అన్నం తినేటప్పుడు గోల చేయవద్దని ఎన్ని సార్లు చెప్పాను?
అబ్బులు: ఏమో, నెక్క పెట్నేదు.
నిర్మల: అయినా, మానలేదుగా!
సింహాద్రి: సెల్లెమ్మా! నా నేం సేయనేదు.
అబ్బులు: ( నిర్లక్ష్యంగా ) సేయనేదూ!
సింహాద్రి: నా నేం జేసినానూ! అసలు నువ్వు నా మంచికెందుకు రాగాలి?
అబ్బులు: అహాఁ. నా నోట్నె రాగినానేటి? నువు నా కూర బలవంతాన నాక్కొని తినేయనేదూ?
సింహాద్రి: కూర శానా బాగున్నాదని. . .
అబ్బులు: నీకే గాని, నాకు బాగోదేటి? ఎంత నక్కంగా సెబుతూన్నాడండీ కబుర్లు! సూసినావా, సెల్లెమ్మా? నా దేం తప్పు లేదు.
సింహాద్రి: నా దంత కన్నా కాదు.
నిర్మల: ఇంతకీ వాదా తప్పు?
అబ్బులు: కూర బాగా వండినందుకు అంతే అవ్వచ్చు ( అంతా నవ్వారు ).
నిర్మల: మీతో తిరిగ్గా మాట్లాడుతూ కూచోడానికి టైమ్ లేదు. లవలల బాబు వచ్చారు. అన్నం వడ్డించాలి.
సింహాద్రి: వచ్చినాడేటి, ఎప్పుడు?
నిర్మల: ఇప్పుడే, మని షదోలా ఉన్నారు. ఆ సంగతి నేను చూసుకుంటానుగాని ముందు మీరు బయలుదెరండి! ( నిర్మల లోని కెళ్ళింది. ఇద్దరూ బయటకు వెళ్ళబోతూ, ఆగి భాస్కర్‌ని పిలిచారు. భాస్కర్ తువ్వాలుతో మొగం తుడుచుకుంటూ వచ్చాడు. )
అబ్బులు: ఎక్కడి కెళ్ళినా వేటి, బాబా?
భాస్కర్: నే నెక్కడకు వెళితే ఏం కాని, మీ ప్రయత్నాల సంగతి చెప్పండి? ముందు నువ్వు చెప్పు, సింహాద్రీ!
సింహాద్రి: ( తల గోక్కుంటూ ) ఇంకా ఏ పని సిక్కనేదు, బాబూ!
భాస్కర్: సరిగ్గా ప్రయత్నించావా?
అబ్బులు: ( కలగ జేసుకుంటూ ) సేసుండడు.
సింహాద్రి: ( చికాగ్గా ) ఏహే. నీ కేటి తెల్సురా నా నేటి జేసినానో!
భాస్కర్: ఏ పని కోసం ప్రయత్నించావు?
సింహాద్రి: రిక్షా తొక్కుదామని.
అబ్బులు: ( వెటకారంగా ) ఓలమ్మో. రిచ్చాయే!
భాస్కర్: నువ్వుండు, అబ్బులూ! ( సింహాద్రితో ) రిక్షా దొరక లేదా?
సింహాద్రి: దొరికినాది. కాని జామీను కావాలట, జామీను.
అబ్బులు: న న్నుండమంటా వేటి?
భాస్కర్: అబ్బులూ! ( అబ్బులు నోరు మూసుకోగా ) ఇప్పుడేం చేయదలుచు కున్నావు?
సింహాద్రి: ఏదేమైనా, ఈ రేతిరికి రిచ్చా సంపాదించనూ!
భాస్కర్: సరే! ( అబ్బులితో ) నీ విషయం ఏమిటి? ( కూచున్న అబ్బులు కాలరెత్తి లేవబోగా ) లేవనక్కరలేదు. కూచొని చెప్పు?
అబ్బులు: కూకుడుంటే సరిగా సెప్పలేం! ( ధీమాగా లేచి కాల రెగరేస్తూ ) అయ్యగోరు. . .
భాస్కర్: వా రెవరు?
సింహాద్రి : ఈ ఎదవే!
అబ్బులు : సరే ... ఈడే! దరిజాగా ఏ నాం!
సింహాద్రి : ఎక్కడి కేట్రా?
అబ్బులు : వోల్ల కాట్లోకి. ఎక్కడి కొక్కడి కెల్లినాను. నీ కెందుకు?
భాస్కర్ : ఊఁ ... కానియ్యి!
అబ్బులు : ( భీకరంగా గొంతు మార్చి ) బాగా బలిసున్న పెద్దమనిషికాడికి...
సింహాద్రి : ఎందుకేట్రా?
అబ్బులు : ( కొరకొరా చూస్తూ ) ఎందుకా, నీకు జామీను ఇప్పిద్దామని! సూడు, బాబూ, పెతీ మాటకూ గురు వడ్డం వచ్చేత్తన్నాడు.
భాస్కర్ : సింహాద్రీ! నువ్వుండు. ( అబ్బులితో ) ఊఁ ... చెప్పు?
అబ్బులు : పెద్దమనిషికాడి కెల్లినానా! ఎల్లి నిల్చిసి అడిగేసినాను.
భాస్కర్ : ఏమని?
అబ్బులు : పని కావాలని. ఆయన న న్నెగాదిగా సూసినాడు. "ఏ టలా సూసే త్తన్నారు" అన్నాను. "పని గురించి న న్నెవడూ ఇలా దబాయించి అడగలేదు. అందుకు చూస్తున్నాను" అన్నారు. "అడిగేదానికి వాన్నుడు ఎందుకండీ" అన్నాను. "అహా" అంటూ దీర్ఘం తీస్తూ— "ఏ పని సేత్తావోయి?" అన్నాడు. "మీ రేపని ఇత్తే ఆ పని బెరమాండంగా సేసేత్తా నండోయ్!" అన్నాను. "ముక్కలికి సిళ్ళేత్తా వేటోయి" అన్నా రాయన. "ఓ. ఓ ట్రలడీగా ... ముక్కలికే

ప్రియమైన గోపీ !

సెలవల్లో ఇక్కడ నువ్వు చిల్లకుర పురుషోత్తం సీరియల్ "ఏది పాపం" చదువుతూ తెలుగు నవలకు నిండుతనం వచ్చిందన్నావు. ఒకే రకం నవలలు చదివి చదివి విసుగెత్తిన పాఠకులకు ఈ తరహా నవల ఎంతో నచ్చుతుందన్నావు. నువ్వన్న మాట ఎంత నిజం! ఇప్పుడది పుస్తకంగా వచ్చింది. వెల: రు. 7—50.

బావా! నీ సంగతెల్లను. నవలల్లో తిర్యాద ం కావాలంటావు. అందుకే గోపాలపురాడి మారుతీ రావు నవలా సమ్మోహనాస్త్రం పాఠకుల మదిలో దాగిన చీకట్లను పారద్రోలే సహజ సౌందర్యాల సంగ్రహిక 'చీకట్లో చిలకలు' వెల: రు. 10—00.

ఇప్పుడున్న ఆర్థిక విధానంలో మనకు ముందు చూపు చాలా అవసరం బావా! ఆ ముందు చూపే లేకపోతే వచ్చే అనర్థాలను తాళ్ళూరి నాగేశ్వరరావు అందరి గుండె తలుపులు తట్టి చెప్పారు "శ్రావణ సంధ్య"లో. వెల: రు. 6—00.

డాక్టర్ సమరంగారి "సెక్స్ సైన్స్" వ్యాసాలు చదువుతూ పుస్తక రూపంగా వస్తే నన్ను తప్పక చదవమన్నావు. అప్పు డెంతో సిగ్గుపడ్డాను. కాని నా వయసు ఆడపిల్లలు నిర్భయంగా చదివితే వాళ్ళ సెక్స్ సమస్యల భయాందోళనలను ఈ పుస్తకాలు పోగొడతాయని తెలుసుకున్నాను. "సెక్స్ సైన్స్" మొదటి భాగం వెల: రు. 7—50. రెండవ భాగం: వెల: రు. 7—50.

ఇవన్నీ నవభారత్ వారి సమర్పణలే! వారి మరి ఇంకెన్నో నూతన ప్రచురణలు వెలుగు లోకి తెస్తున్నారు. వారికి వి. పి. పి. పద్ధతి లేదు. ఒకటి రెండు పుస్తకాలు కావలిస్తే వాటి ఖరీదుతో పాటు రు. 2—00 అదనంగా M.O. చేస్తే రిజిస్టరు పోస్టులో పంపుతారు. 30 రూపాయలు M.O. చేస్తే ఆ విలువకు పోస్టేజి ఉచితం.

నవభారత్ ప్రచురణలు అన్ని పుస్తకాల షాపులలోను ఉంటాయి.

నీ
రాధ

వారి అడ్రసు : నవభారత్ బుక్ హౌస్
ఏలూరు రోడ్డు • విజయవాడ

కాదు — కావలిస్తే మెడమీకి కూడా పోసేస్తానండోయ్" అన్నాను. "సరే. పోసేస్తేయ్" అన్నా డాయన. ఆవలంగా పోసేసాను. పిళ్ళు!

సింహాద్రి : ఏటీ ... ఆయన నెత్తిమీదే!

అబ్బులు : కాదు, మొక్కలికి!

భాస్కర్ : బాగుంది. మరి జీతం?

అబ్బులు : అది నా నడగనేదు. ఆయ నెంతిస్తే అంతే సూసినావా, బాబూ! గురూ కన్నా బేగా ... చ ... ఘుటుపేట ... ఏ కన్నా బేగా పని సంపాయిం చేశాను.

భాస్కర్ : చాలా సంతోషం!

సింహాద్రి : ఆఁ ... ఏదో గొప్పగా సెప్పేసుకుంటన్నాడుగాని, అది పనే పేట?

అబ్బులు : ఏం, నీ బోడి రిచ్చాకన్నా తీసిపోనా దేటి?

నిర్మల : ( వచ్చి ) మీ రింకా వెళ్ళలేదా? అర్జంటుగా వెళ్ళిపోవాలంటూ అన్నం పెట్టే వరకూ నన్ను నిలబడనీయలేదు. ఇలా వాదులాడుకుంటూ ఇంకా ఇక్కడే ఉన్నారన్నమాట!

సింహాద్రి : లేదమ్మో, ఎల్లిపోతాం! బాబు ఇవరా లడిగితేనూ ...

నిర్మల : చెప్పారుగా. ఇక బయలుదేరండి. ( ఇద్దరూ వెళ్ళగా, భాస్కర్‌తో ) రండి, అన్నం వడ్డించాను.

భాస్కర్ : ( హఠాత్తుగా నిరాశ పడిపోతూ ) చెప్పానుగా!

నిర్మల : ఏమని?

భాస్కర్ : ఆకలిగా లేదని?

నిర్మల : ఎందుకు లేదు?

భాస్కర్ : నా మనసేం బాగోలేదు.

నిర్మల : అంతేనా లేక ఎదురు దెబ్బతో కడుపు నిండిపోయిందా?

భాస్కర్ : నన్ను పరిహసిస్తున్నారా?

నిర్మల : విచారిస్తున్నాను. లేకపోతే ఏమిటండీ, భోజనం చేయడానికి కూడా ఇంతలా నిరుత్సాహపడిపోతే ఎలా? నే నెన్నోసార్లు చెప్పాను. ప్రతి చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకోవద్దని.

భాస్కర్ : ఏం చేయను? అనుభవం నేర్పిన మొదటి పాఠం అదే అయితే ...

నిర్మల : దాన్నే పట్టే పడుతూ కూర్చున్నా రన్న మాట. దొంగలను మార్చడం మలువే కానీ ...

భాస్కర్ : నా మీద మీకు చాలా అసహ్యంగా ఉందనుకుంటాను.

నిర్మల : చనువును పెంచుకుంటున్నానేమోనని బాధ పడుతున్నాను.

భాస్కర్ : నేను మిమ్మల్ని పూర్తిగా విశ్వసిస్తున్నాను.

నిర్మల : నిర్ణయం మాటల వరకే పరిమితం కాకూడదు. నా మీద ఏ పాటి విశ్వాసం ఉన్నా—మీ బాధలు, సమస్యలు నాతో పంచుకోవచ్చుగా? నిజం చెప్పండి. మనసెందుకు బాగోలే దన్నారు? ఒంటరిగా కూర్చొని, గంటల తరబడి ఎందు కాలోచిస్తుంటారు?

భాస్కర్ : అది మీ కిష్టంలేదా?

నిర్మల : ఇష్టంలేదని కాదు — అదంత ఆరోగ్యకరమైంది కాదంటున్నాను. ఇంతకీ మీ ఆలోచన, రేపు ఇంటర్వ్యూ గురించేనా?

భాస్కర్ : దాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు.

నిర్మల : ( విస్తుపోతూ ) అయితే, మీరు వెళ్ళరా?

భాస్కర్ : వెళ్ళి సాధించేదేమీ లేదు. వట్టి ప్రయాస తప్ప!

నిర్మల : మీలో ఇంతటి నిరాశావాదం పేరుకుపోయిందా?

భాస్కర్ : ఆశావాదం గగన కుసుమం అయితే, నిరాశావాదమే గాదు; నిరసనవాదం కూడా పుడుతుంది.

నిర్మల : మీ రింతటి పిరికివా రనుకోలేదు.

భాస్కర్ : పిరికివాణ్ణే! బ్రతుకుతెరువుకోసం ఎదురుచూడ్డం తప్ప బ్రతికే విధానం నాకు తెలియటం లేదు. ఎంతైనా అవస్థ పడుతున్నానుగాని,


గ్రామ్స్ : కామాక్షి సిల్క్స్ | ఫోన్ :77375

దసరా దీపావళి పండుగల సందర్భముగా ప్రత్యేక రిబేటు

28-9-76 నుండి 22-10-76 వరకు

10% + 10% రిబేటు ఇవ్వబడును

స్త్రీల సౌందర్యాభివృద్ధికి వలయు అసలైన వెండి జరీతో తయారయిన కంచి పట్టుచీరలు, లంగాలు.

కంచి ధరలకే విజయవాడ బ్రాంచిలో లభించును.

ఆదివారములు, పండుగ రోజులలోకూడా షాపు తెరచియుండును.

కంచి కామాక్షమ్మ పట్టు చేనేత కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ G-1612

హెడ్డాఫీసు : కంచి, 168-A, గాంధీ రోడ్డు.

బ్రాంచీలు : మసీదు వీధి, ఏలూరురోడ్డు, విజయవాడ-520002.

27, 2-వ అగ్రహారం, సేలం-1.

కె. యస్. పార్థసారథి. అధ్యక్షులు. | టి. ఇ. జ్ఞానసుందరం, బి.ఎ. కార్యదర్శి.

SAVITA

ఈ వ్యవస్థ తాలూకు లోక్యాన్ని అర్థం చేసుకోలేక పోతున్నాను. నేను పిరికివాణ్ణి కాదు— అసమర్థుణ్ణి కూడా!

నిర్మల : ( అతని కన్నీళ్ళను గమనించి ) ఏమిటీ, మీ కళ్ళలో కన్నీళ్ళా? చ చ! మగాడి కన్నీటి మీద నాకు సానుభూతి లేదు.

భాస్కర్ : లేని సానుభూతి, ఉన్న బలహీనతను తొలగించలేదు.

నిర్మల : ( ధైర్యపరుస్తూ ) బాబూ! మీరు బలహీనులు కారండి! అనంతమైన ఆత్మ విశ్వాసం, కార్యదీక్ష మీలో మూర్తీభవించి ఉన్నాయి. మీ దారికి అవరోధం అనేదే లేదు. తాత్కాలిక సమస్యలు శాశ్వత పరిష్కారాలు కావు. బాగా ఆలోచిస్తే మీలో పెరిగిన నిరాశకు కారణం లేకపోలేదు. చెప్పమంటారా?

భాస్కర్ : చెప్పండి?

నిర్మల : మీ ఒంటరితనం!

భాస్కర్ : నా ఒంటరితనమా? కాదు.

నిర్మల : మువ్వాటికీ అదే! తోడు అనేది లేనివాడు, మనిషి మనిషిగా బతుకలేడు. సహజమైన ఈ లోపం మిమ్మల్ని మిగిలిస్తే మీలో మరే బలహీనతకూ తావు లేదు. అన్నయ్యలు మీ వల్ల మారి గలిగారే గాని— మిమ్మల్ని అర్థంచేసుకోలేక పోయారు. కేవలం సానుభూతి మినహా, అంతర్లీనమైన ఉన్న ఆవేదనకు పరిష్కారం చూపలేక పోయారు. చూపే శక్తి వాళ్ళలో లేదు కూడానూ!

భాస్కర్ : మీకు జ్యోతిషంలోగాని అనుభవం ఉందా ఏం?

నిర్మల : ఫేస్ రీడింగ్‌లో కాస్తంత టచ్ ఉంది.

భాస్కర్ : నాలో ఇంకా ఏవేవి చదివారు?

నిర్మల : పూర్తిగా చదివేశాను. కసాయి హృదయాల్లో కారుణ్యం నింపి, శిలా జీవితాన్ని అపురూప శిల్పాలుగా మలిచి, చీకటికే కొత్త వెలుగులు సృష్టించిన మీ అనన్య సామాన్యతను చదివాను. జోహారు చేశాను.

భాస్కర్ : ఆ తృప్తి నాకు మిగిలేది!

---

## రాధా మాధవులు

—డి. వి. నాగభూషణం (హైదరాబాద్)

---



నిర్మల : అంతేకాదు. ఆశించినదాన్ని తప్పక సాధిస్తారు. లంచాలు, రికమెండేషన్లతో ప్రాధాన్యం వహించిన ఉద్యోగపు వ్యవస్థ మీకు ప్రతిబంధకం కాదు. ఆ నమ్మకం నా కుంది.

భాస్కర్ : నాకుమాత్రం లేదు!

నిర్మల : ప్రయత్నం ఉండాలేగాని, ప్రతి వెనుకడుగూ ప్రగతికి సోపానం అవుతుంది. అయినా, మీ రిక ఏ విషయంలోనూ దిగులు పడ నక్కర్లేదు. నే నున్నానుగా మీ తోడు.

భాస్కర్ : మీరా .. తోడా! అంటే?

నిర్మల : మరోలా అర్థం చేసుకోకండి. ఇంతకాలం అన్నయ్యలకు మీ రెలాంటి తోడో, నేను మీ కలా!

భాస్కర్ : మీ ఉత్సాహ ప్రోత్సాహాలకు చాలా థాంక్స్!

నిర్మల : అందుకే రేపు ఇంటర్వ్యూకు వెళ్ళా లంటున్నాను.

భాస్కర్ : ప్రయత్నిస్తాను.

నిర్మల : అదిగో, ఆ నిరాశే పనికిరాదు. వెళ్ళి తీరాలి. ఈ సారి తప్పక విజయం సాధిస్తారు. మీతోపాటు నేనూ వద్దామనుకుంటున్నాను.

భాస్కర్ : మీ రెందుకు?

నిర్మల : చెప్పానుగా తోడని.

భాస్కర్ : మీరు తోడుగా వచ్చినంతమాత్రాన ఉద్యోగం రాదు. మిమ్మల్నిచూసి ఎవరూ ఉద్యోగం ఇవ్వరు.

నిర్మల . పోనీయండి, కనీసం మానవయత్నంగా!

భాస్కర్ : ఏమైన రాక తప్పదంటారు.

నిర్మల : మీ కిష్టంలేకపోతే ...!

భాస్కర్ : నో ... నో! అటువంటి దేం లేదు, రండి!

నిర్మల : హమ్మయ్య. మిమ్మల్ని దార్లోకి తీసుకొచ్చేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది. ఇకనైనా వస్తారా భోజనానికి.

భాస్కర్ : మీ రా విషయం మరిచిపోసట్టుంది.

నిర్మల : మనం మరిచి[illegible]నా, ఆకలి మరిచిపోనివ్వదుగా!

భాస్కర్ : అంతే[illegible] పదండి.

( [illegible] లైట్లు ఆరిపోయాయి. ఆ రోజు గడిచిపోయింది. )

(సశేషం)



నాటిక

# గ్రహణం

— డి. నారాయణవర్మ

## పాత్రలు

భాస్కర్
సింహాద్రి
అబ్బులు
నిర్మల

(క్రిందటి సంచిక తరువాయి)

## 3

( తిరిగి వెంటనే లైట్లు వెలిగాయి. మరునాటి సాయంకాలం చీకటి పడే వేళ. వరండాలో మార్పేం లేదు. మలక మంచం పక్కగా హరికేన్ లాంతర్ వెలుగుతూ ఉంది. సింహాద్రి మంచానికి జేర్లబడి, కాళ్ళు జారచాచుకుని కూర్చున్నాడు. అబ్బులు అతని కాళ్ళు పడుతూన్నాడు. )

సింహాద్రి : ( మందకొడిగా ఉన్న లాంతరు వత్తి పెద్దదిచేసి, బీడి వెలిగించుకొని, మూలుగుతూ ) అబ్బా ... అమ్మా! కాస్త నెమ్మదిగా పట్టరా కాళ్ళు!

అబ్బులు : మరి రిచ్చా తొక్కడం అంటే ఏటనుకున్నావు, గురూ!

సింహాద్రి : కొత్తమూలాన. కొత్త సీకు లెట్టినాయిగాని, అలవాటయిపోతే— ఎదవ రిచ్చా ... అదెంతరా! ( బీడీ గట్టిగా పీల్చుతూ ) ఒరేయ్! ఇయ్యాల నా నెంత సంపాయిత్తినో తెలుసా?

అబ్బులు : ఎంతేటి, గురూ!

సింహాద్రి : పదేను రూపాయల్లా ... పదేను.

అబ్బులు : అబ్బా ... పదేనే!

సింహాద్రి : మరేటనుకున్నావు. పెడ్డ కట్టం రూపాయలుగా మారి సేతిల్లో పడతాంటే ... నా సామిరంగా, ఒళ్ళంతా గాలిలో తేలిపోనాదిరా! ఏటో గానీ, నా కియ్యాల మా సంబరంగా ఉన్నాది. మనసేమో అయిసలా పోతన్నాదిరా ... అయిసు.

అబ్బులు : నిజమే, గురూ! "నాను సానా నిక్కచ్చిగాణ్ణని" మా యజమాని అంతన్నప్పుడు, నా మనసు కూడా అలాగే అయిపోనాది.

సింహాద్రి : ( వేదాంతిలా నవ్వుతూ ) సిత్రం పేటోగాని ... ఏ ఏలకి ఎవు లెలా మారతారో ఎవులూ సెప్పలేరు గదా! నాలుగు రోజులకే మన బతుకు లెలా మారిపోయినాయో సూడు.

అబ్బులు : అవును, గురూ! తలునుకుంతాంటే, అంతా ఏదో కతలాగుంది. మారిపోనాది మనసేనానిపిత్తాంది.

సింహాద్రి : కతంటే గుర్తు కొచ్చినాది. ఒరేయ్! సిన్నప్పుడు మా యమ్మ సిన్న కతొకటి సెప్పినాదిరా!

అబ్బులు : ఏటది?

సింహాద్రి : వాల్మీకి మహా ముని ఒకాయన ఉండేవోడట. నీకు తెలుసునేటి?

అబ్బులు : ఎవులు?

సింహాద్రి : వాల్మీకి మహా మునెహే!

అబ్బులు : శానా బాగున్నాది. "ఎంకటరెడ్డి గారి కులనేటి" అన్నాట్టున్నాది, నీ సెమత్కారం. నువ్వే సెప్పినావుగా వాల్మీకి మహామునని.

సింహాద్రి : అది కాదెహే! మహాముని కాక ముందు ఆయ నెవులో తెల్సా?

అబ్బులు : అయింతర్వాతే తెల్దు. ఎవులేటి?

సింహాద్రి : పెద్ద దొంగట్రా ... దొంగ.

అబ్బులు ( కులుకుతూ ) ఆహా ... అదీ సెక్క. నీ యమ్మ గొప్ప కతే సెప్పినాది. అయితే మునిగోరు మన్లాగే జేబులు కొట్టేసే వోడన్న మాట!

సింహాద్రి : ఎదవ జేబులు ... బుర్రలు ... బుర్రలు బద్దలు కొట్టేసేవోడట్రా!

అబ్బులు : అబ్బా. అయితే మన పెద్ద గురువన్న మాట!

సింహాద్రి : ఇంతకీ సెప్పొచ్చేదేటంటే ... అంత కర్కోటకుడూ "మరా—మరా" అంటానే మహా ముని అయిపోయినాడట్రా!

అబ్బులు : మనం కూడా అంత గొప్పోళ్ళం అయిపోతావంటావు.

సింహాద్రి : అంతాశ మన కెందుగ్గాని...మంచి కయినా, పెడ్డ కయినా గురి ఆనేది కుదిరేత్తే, మట్టూరా గిరి గీసేసుకుంటాడ్రా మనిసనే వోడు.

అబ్బులు : గురుగా రేటంతన్నారో, నాకు బోధపడకుంటన్నాది.

సింహాద్రి : అనడాని కేటుందిగాని, బాబూ — పెల్లెమ్మల సాయం ఉంటే— ఎంతైనా సెప్పొచ్చు. ఏదైనా సెయ్యొచ్చు.

అబ్బులు : ( ఏదో గుర్తుకు రాగా ) గురూ ... గురూ! బాబుని — పెల్లెమ్మని సూత్తాంటే నీ కేవనిపిత్తాంది?

సింహాద్రి : మనకోసం ఊడిపడ్డ దేవుళ్ళని.

అబ్బులు : అది కాదు, గురూ! ఇంసక్కా ఈడూ జోడూ కుదిరిన జంటలా అవుపించడం లేదూ?

సింహాద్రి : అవున్రోయ్. అసలా ఇదంగా నా నెప్పుడూ సూడ్లేదు.

అబ్బులు : అళ్ళిద్దరూ, ఒకింటోళ్ళయిపోతే ఎలా ఉంటాది, గురూ!

సింహాద్రి : మా సక్కా ఉంటది. బాబుకి ఉద్యోగం రానీ సూద్దాం!

అబ్బులు : రాకేటి సేత్తాది. ఈ పాలి తప్పకుండా వచ్చేత్తాది.

సింహాద్రి : నానూ అదే అనుకుంతన్నాను. పెల్లెమ్మ ఎంట ఎల్లినందుకైనా వచ్చెయ్యాల. ఇదిగో పెల్లెమ్మంటే ఏటనుకుంతన్నావు. లచ్చిమిరా, లచ్చిమి.

అబ్బులు : బాబుకి ఉద్యోగం వత్తే జీతం ఎంతిత్తారంటావు?

సింహాద్రి : వచ్చేదేదో రానీరా, అపుడు జీతం సంగతి సూడొచ్చు. పెళ్ళి సంగతి ఆలోసించొచ్చు!

( ఇంతలో ఊహించని వేగంతో భాస్కర్ వచ్చాడు. )

సింహాద్రి : (ఆత్రంగా ) బాబూ! వచ్చేసినావా? ఎల్లిన పని ఏటయినాది?

అబ్బులు : ఉద్యోగం దొరికినాదా?

భాస్కర్ : ( అస్తిమితంగా ) ఆఁ ... ఆఁ .... దొరికింది. ( ఆ వార్త విని వాళ్ళిద్దరూ పట్టరాని ఆనందంతో భాస్కర్‌ను పైకెత్తి జై కొట్టారు. )

సింహాద్రి : ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు ... ఎంతటి సల్లని కబురు ఇన్నాం! సరేగాని, బాబూ, జీతం ఎంతేటి?

భాస్కర్ : ( తడబడుతూ ) జీతం ... జీతం ... మూడొందలుంటుంది.

సింహాద్రి : ( అటు ఇటు చూసి ) పెల్లెమ్మేది, బాబూ?

అబ్బులు : అవును. ఏది? సంబరంలోపడి పెల్లెమ్మ ఉనికే మరిసిపోనాం!

భాస్కర్ : ( ఉలిక్కిపడి — సమాధానంకోసం తడుముకుంటూ) నిర్మలా ... నిర్మల చీరలు కొనుక్కోవడానికి షాపు కెళ్ళింది.

సింహాద్రి : ఎంట నువ్వూ ఎళ్ళక — ఒంటరిగా ఎందు కొదిలి పెట్టినావు?

భాస్కర్ : ( విజాయితీని ప్రదర్శిస్తూ ) వస్తానని నేనూ అన్నాను. కాని, నిర్మలే వద్దంది. ఉద్యోగం సంగతి మీకు చెప్పమని ముందుగా వెళ్ళమంది. అయినా, నిర్మలకేం! పోతే ఆమె ఇక్కడికి వచ్చేలోగా పెళ్ళికి ఏర్పాటు చేయాలి.

సింహాద్రి, అబ్బులు : ( అయోమయంగా ) పెళ్ళా?

భాస్కర్ : అవును. పెళ్ళే! నిర్మలను నేను పెళ్ళి చేసుకుంటున్నాను.

సింహాద్రి : ( కొయ్యబారిపోతూ ) ఆఁ !

అబ్బులు : ఏటి ... నానుగాని కల గనెత్తన్నానేటి?

భాస్కర్ : కలకాదు. యథార్థం, అబ్బులూ, యథార్థం. సింహాద్రీ! నీవు అలా కొయ్యబారిపోయావు? నీకు సమ్మకం కలగడంలేదా?

సింహాద్రి : ( తెప్పరిల్లి ) ఎంతమాట ఎంత మాట! నమ్మకా లెక్కువైపోయి, ఏటో ... ఏటో మావేం సెయ్యాల్నో తెలియకుంటన్నాది.

అబ్బులు : అవును, బాబూ! సెనం కితమే అనుకున్నాం! మీ రిద్దరూ ఒకటై పోతే బాగుంటదని.

భాస్కర్ : ఆహాఁ అయితే, మీ మాటలను నిజం చేస్తున్నా నన్న మాట! సరే, తీరిగ్గా మాట్లాడడానికి టైమ్ లేదు. త్వరగా పెళ్ళి ప్రయత్నాలు చేయాలి.

సింహాద్రి : దీని కింత ఆట్మాసం ఎందుకు, బాబూ, రెండు దండ లిట్టుకొంటే సరిపోదూ? ఏరా, అబ్బులూ?

అబ్బులు : ఓ ... బెరమాండమైన అయిడియా!

భాస్కర్ : వెరీ గుడ్. మీ సలహా బాగుంది. బయలుదేరండి దండలకి. ఇదిగో. ఇక్కడున్నట్టుగా రావాలి!
( ఇద్దరూ వెళ్ళబోయి, ఠక్కున ఆగారు )

సింహాద్రి : బాబూ! సెల్లెమ్మకు సంగతి తెలుసా?

భాస్కర్ : తెలీదు. నేనే చెప్పలేదు.

అబ్బులు : ఎందుకు సెప్పలేదు?

భాస్కర్ : అదా ... అది, ముందే చెబితే అంత రంజుగా ఉండదని, చిన్న సస్పెన్సులో ఉంచేశాను. హఠాత్తుగా విషయం విని ఆమె ఆశ్చర్య పడాలని ప్రస్తుతానికి మరుగుపరిచాను.

( వాళ్ళిద్దరూ వెళ్ళారు. భాస్కర్ ఒకసారి పెద్దగా నిట్టూర్చాడు. మొగానికి పట్టిన చెమట తుడిచేసుకున్నాడు. ఎంతగా నిగ్రహించుకుందా మను కున్నా, అనుక్షణం నిలదీస్తున్న అంతరాత్మకు సమాధానం చెప్పుకోలేకపోయాడు.)

భాస్కర్ : ఆశ్చర్యపోతుందా! పెళ్ళి చేసుకుంటానన్న వార్త విని నిర్మల ఆశ్చర్యపోతుందా! ఉహూఁ... పడదు. పడదంతే! భగవంతుడా! తట్టుకో లేక పోతున్నా నీ క్షోభ. ఎలా? ఎలా చల్లారుతుంది?

( అస్థిమితంగా నలుమూలలకూ కలియదిరుగుతూ పిచ్చిగా గొణు క్కుంటూ, మలక మంచం మీద కూలబడ్డాడు. రెండు చేతులతోనూ జుత్తు పీక్కొంటూ, తలను విదిలించుకొంటూ, గట్టిగా కళ్ళు మూసుకొంటూ— అలా వెనక్కి మంచంలోకి జారిపోయాడు. అలసట పడ్డ శరీరం విశ్రాంతి కోరింది.

లైట్లారిపోయి — రెడ్ లైట్ వెలిగింది.

ఎర్రటి కాంతిలో భాస్కర్‌లో రేగిన అశాంతి, సంఘర్షణ ఊహాజనిత దృశ్యమైంది.

ఆ దృశ్యంలో భాస్కర్ అలా మంచం మీద పడుకొనే ఉన్నాడు. క్షణం తరవాత నిర్మల వచ్చింది. క్షణం తటపటాయించి, ఆ పైన భాస్కర్‌ని మెల్లగా తాకింది. ఆ స్పర్శకు భాస్కర్ వెర్రి కేకతో ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా కనుపించిన నిర్మలను చూసి విభ్రాంతుడయాడు. )

నిర్మల : ( ఎంతో తాపీగా ) బాబూ! ఏమి టలా కొయ్యబారిపోయారు?

భాస్కర్ : ( తేరుకొంటూ ) అబ్బే ... నేను ... నేను కొయ్యబారలేదే!

నిర్మల : కనిపించేదాన్ని కాదంటారేం! మిమ్మల్ని పరీక్షిస్తూంటే ...

భాస్కర్ : ఆఁ! ... పరీక్షిస్తుంటే ...

నిర్మల : మీలో ఏదో సంఘర్షణ జరుగుతూన్నట్టు ...

భాస్కర్ : లేదు.

నిర్మల : అంతరాత్మ నిలదీస్తున్నట్టు ...

భాస్కర్ : లేదు ... లేదు.

నిర్మల : నీతి నిజాయితీ గేలి చేస్తున్నట్టు ...

భాస్కర్ : కాదు ... కాదు. నీ ఎక్స్‌పెక్టేషన్స్ రాంగ్!

నిర్మల : సమర్థించుకోకండి. మరేం ఫర్వాలేదు. జరిగే సంఘర్షణ, నిలదీసిన అంతరాత్మను, గేలిచేసే నీతి నిజాయితీని కేర్ చేయకండి. అంతగా వినకపోతే చిత్రవధ చేసేయండి.

భాస్కర్ : ( విలవిల్లాడిపోతూ ) మాటలతో నువ్వే నన్ను చిత్రవధ చేసేస్తున్నావు.

నిర్మల : నేనా ... మిమ్మల్నా ... సారీ ... సో సారీ! ఇకా ప్రసా వన వదు లెండి. ఇంతకీ నే నెలా కనిపిస్తున్నాను, బాబూ?

భాస్కర్ : అదేం ప్రశ్న?

నిర్మల : అర్థంలేని ప్రశ్నమాత్రం కాదు.

భాస్కర్ : మామూలుగానే కనిపిస్తున్నావు.

నిర్మల : అంతేగాని, ప్రత్యేకత అంటూ ఏం లేదంటారు?

భాస్కర్ : లేకేం! అప్సరసలా...కాదు, వనదేవతలా...ఉహూఁ... పెళ్ళికూతురిలా...

నిర్మల : ( నవ్వింది ) వాట్? నేను మీ కంటికి పెళ్ళికూతురిలా కనిపిస్తున్నానా? కొంపదీసి జోక్ చేస్తున్నారా ఏం?

భాస్కర్ : నో, ఇట్స్ నా టొటాలె జోక్!

నిర్మల : పోన్లెండి, బ్రతికాను. ఇంతకీ ఈ దీనురాలిని పెళ్ళాడేవా రెవరండీ! ఐ డి బై మీరా?

భాస్కర్ : కాకూడదా? నేనే!

నిర్మల : ( ఎంతో ఆశ్చర్యంగా ) మీరా! మీరు నన్ను పెళ్ళిచేసుకోవడమా?

భాస్కర్ : వై నాట్?


## డియర్ రాధా !

సెలవుల్లో మీ ఇంటి కొచ్చినప్పుడు కకుభ గారి సీరియల్ ఇన్‌టరెస్టింగ్‌గా చదువుతూ వర్రీగా, మూడీగా ఉండేదానివి. తారాస్థాయికి ఎదిగిన మగవాడు వయ్యారిభామ వలలోపడి భార్యాబిడ్డల్ని దూరం చేసుకుంటే అందరి జీవితాలు అంతే! అప్‌సెట్ అవుతాయి. కథలో ఎంత వావెల్టీ ఉంది! నువ్వన్నట్టు సాటిలేని మేటి నవలే. "జీవితం ఏమిటి" వెల: 12—50.

చిర పరిచిత రచయిత్రి కొలిపాక రమామణి నవల "గడ్డిపోచలు" లో మధ్య తరగతి మహిళ తలకు మించిన బాధ్యతల మిజరీని మన లైఫ్‌లో లెసన్‌గా తీసుకోవాలి రాధా—నవల వెల : రు. 6—00 కదూ—

హౌవ్ స్వీటిటీజ్! హ్యూమరసాన్ని టన్నుల కొద్దీ పేజీల్లో నింపిన యర్రంసెట్టి శాయి నవ్వుల నాన్‌స్టాప్ "ప్రేమకు ఫుల్‌స్టాప్ వుందా?" నావెల్—రియల్లీ వండర్‌ఫుల్! వెల: రు. 6—00 మాత్రమే!

ప్రేయసికి దూరంగా ఉన్న నాలాంటి యంగ్‌మెన్ కొచ్చే సవాలక్ష సెక్స్ సమస్యలకు మంచి గైడులా పనిచేస్తుంది డా. సమరంగారి "సెక్స్ సైన్స్!" బిలీవ్ మీ—మా ఫ్రండ్సందరి రకరకాల సెక్స్ సందేహాలకు 'కీ' లా జవాబు చెప్పే సెక్స్ కంప్యూటర్ 'సెక్స్ సైన్స్' అని గుర్తించాం. మొదటిభాగం 7—50, రెండవ భాగం 7—50.

ఈ పుస్తకాల్తో పంపిన నవభారత్ వారి కేటలాగులో ఎన్ని కొత్తపుస్తకాలున్నాయ్ రాధా! నువ్వు వ్రాసినట్టు నవభారత్ వారు వి. పి. పి. పద్ధతి అంగీకరించరనీ, ఒకటి రెండు పుస్తకాలు కావల్సివస్తే ఆ పుస్తకాల ఖరీదుతోపాటు రూ. 2—50 కలిపి M.O. చేస్తే రిజిష్టరు పోస్టు ద్వారా పంపుతారనీ రూ. 30—00 విలువ గల పుస్తకాలకు M.O. చేస్తే పోస్టేజి ఉచితమనీ మా మిత్రులందరికీ చెప్పేను.

నీ బావ
గోపీ

నవభారత్ బుక్‌హౌస్
ఏలూరు రోడ్డు • విజయవాడ-2

( అడ్రెసు కరెక్టే కదూ )

నిర్మల : బాబూ! మీ నిర్ణయం మార్చుకోవడం చాలా మంచిది.
భాస్కర్ : అంటే నీ ఉద్దేశ్యం?
నిర్మల : నేను మీకు తగనండీ, తగను.
భాస్కర్ : అబ్బా, తగనూ ... తగదు! తగని తప్పించుకోకు, నిర్మలా!
నిర్మల : కాదండీ, అంతటి అర్హత నాకు లేదు.
భాస్కర్ : లేదని ఎవ రన్నారు?
నిర్మల : నేనే అనుకొంటున్నాను.
భాస్కర్ : నువ్వనుకుంటే సరిపోదు. ఇంకా అర్హత అనేది నాకు ...

నిర్మల : ( మాటలు కద్దువస్తూ ) అయ్యయ్యో, ఎంతమాట! యూ ఆర్ భాస్కర్! అరుణ కిరణాలతో సకల చరాచర ప్రకృతి చైతన్యం పొందినట్లే, మీ సహవాసం ఉన్న ప్రతి ఒక్కరూ సంస్కరించబడతారు. నిజంగా మీరు సంస్కర్తలండీ ... సంస్కర్తలు!
భాస్కర్ : స్టాపిట్ ... నిర్మలా, స్టాపిట్! నన్ను ఆకాశాని కెత్తేయక చెప్పు. చేసుకుంటావా లేదా? కమాన్ ... ప్లీజ్!
నిర్మల : ( అదోలా నవ్వుతూ ) ఉద్రేకపడకండి! మీ రింతలా తొందరపడిపోతున్నారు కాబట్టి ...




మామూలు పౌడర్లతో శుభ్రపరిస్తే
జిడ్డు మరకలు మిగిలిపోవచ్చు

విమ్ తళతళ మెరిసేలా శుభ్రపరుస్తుంది.
దీనిలో నురుగునిచ్చే శక్తి 50% అదనంగా వుంది.

ఏ యితర శుభ్రపరిచే పౌడర్లకన్నా విమ్‌లో డిటర్జెంట్ ఎక్కువగా వుంది. తక్షణమే జిడ్డునూ, మరకలను పూర్తిగా తొలగిస్తుంది. పౌడర్ యొక్క మరకలు ఏ మాత్రం మిగిలిపోవు. అది మెత్తని పౌడర్ కావడం వలన చక్కగా గీతలు పడకుండా శుభ్రపరుస్తుంది.

జిడ్డు కాదు! గోసుకు పోదు!
మురికి ఏమీ మిగలదు!




విమ్ విలువ మహత్తరమైనది. ఈ ప్యాక్ కొన్నప్పుడు మీకు 25% కన్నా ఎక్కువ అదా

తళతళ తప్ప విమ్ ఏదీ మిగల్చదు

ఈ హిందుస్థాన్ లివర్ వారి విశిష్ట ఉత్పాదన 500 గ్రాములు మరియు 1.5 కి. గ్రా. ప్యాక్‌లలోనే దొరుకుతుంది. విడిగా మాత్రం అమ్మబడదు

లింటాస్ వి.ఎం.47-140 TL

భాస్కర్ : కాబట్టి ( ఉద్దేశ్యం అర్థమయినట్టు ) ఆఁ. అర్థమయింది ఇద్దరికీ అయ్యారుగా, థాంక్స్, నిర్మలా, థాంక్స్!

నిర్మల : అది నేను తెలియబరుచుకోవాలి! కన్నెకు పెళ్ళికన్నా కావలసిం దేముం టుంది, చెప్పండి? ఇంతకూ ఎప్పుడు చేసుకుంటా రేమిటి?

భాస్కర్ : కాసేపట్లో. సూర్యచంద్రాదుల సాక్షిగా.

నిర్మల : ( నవ్వింది ) బాబూ, ఈవేళ అమావాస్య. పోతే ఇది రాత్రి. మీరు చెప్పిన వారు సాక్ష్యానికి రారు.

భాస్కర్ : పోనీ, నా అంతరాత్మ సాక్షిగా.

నిర్మల : అంతరాత్మ! అదెక్కడుంది? ఓహో! ఇంకా చిత్రవధ చేసుకోలే దను కుంటాను.

భాస్కర్ :( బాధగా ) అబ్బా! ... సరే, మీ అన్న లున్నారుగా!

నిర్మల : అలా అన్నారు బాగుంది. ఏరీ వాళ్ళెక్కడ?

భాస్కర్ : దండలు తీసుకు రావడానికి వెళ్ళారు.

నిర్మల : శుభం. ఉద్యోగం వచ్చిన ఉత్తరక్షణం నించీ ఏకాసమీ మెయిన్ టెయిన్ చేసేస్తున్నారన్నమాట. వాళ్ళిద్దరూ ఈ వార్త విని పొంగిపోయా రనుకొంటాను.

భాస్కర్ : ఎగిరి గంతేశారు.

నిర్మల : గంతులు వేయించడమే మీలో ఉన్న టెక్నిక్! పాపం! మారిన వాళ్ళ దృష్టిలో—ఆఫ్ కోర్స్ నేనూ మారిపోయానే అనుకోండి, ముఖ్యంగా వాళ్ళెదట మీ గొప్పదనం మరో మెట్టు పెరుగుతూం దనుకొంటాను.

భాస్కర్ : నిర్మలా, నువ్వు ఆదోలా మాట్లాడేస్తున్నావు.

నిర్మల : ఆదోలా అంటే ...?

భాస్కర్ : అంటే ... చాలా అసందర్భంగా!

నిర్మల : అనవసరంగా నన్ను అనుమానించేస్తున్నారు. ఏదీ ... అసందర్భం అన్నిటి కన్నా ఇంకొక్కసారి, నా కళ్ళలోకి చూస్తూ అనండి? మాటిగా మాస్తూ అనాలి మరి.

భాస్కర్ : నిర్మలా, ఏమి టీ అగ్ని పరీక్ష?

నిర్మల : చూడాలి. చూడగలిగేధైర్యం మీ కుండాలి. ఉందనే అనుకొంటున్నాను. అప్పుడు నన్నేకాదు — వందలాది అనాథలను ఆదుకొన్నట్టవుతుంది. దగా పడ్డ వేలాది కన్నెలను సంస్కరించినట్టు అవుతుంది. మరో వీరేశలింగంగా మీరు గుర్తింపబడతారు.

భాస్కర్ : ఆశక్తుణ్ణి, నిర్మలా, అశక్తుణ్ణి!

నిర్మల : నన్నే చూడలేని వారు, ఇక పెళ్ళేలా చేసుకుంటారండీ?

భాస్కర్ : చూడగలిగే ధైర్యం కోసం!

నిర్మల :( అప్పటివరకూ ఉన్న వ్యంగ్యం, సహనం పోయి, హఠాత్తుగా ఆవేశపడి పోతూ ) భాస్కర్ ... చూడగలిగే ధైర్యంకోసమా నన్ను పెళ్ళాడ్డం? హుఁ, నా కున్న ఫేస్ రీడింగ్ దృష్ట్యా నా మేనమామని — రౌడీని— అన్నయ్యలనూ అందర్నీ చదవ గలిగానేగాని, నిన్ను చదవలేకపోయాను. చదివినా నువ్వు మరో రకంగా అర్థమయ్యావు.

భాస్కర్ : వద్దు, వద్దు! నన్ను భయంకరంగా చిత్రించద్దు. దారుణంగా ఊహిం వద్దు. కాస్తంత జాలి చూపించు. ఐ వాంట్ సింపతీ ఫ్రమ్ యూ!

నిర్మల : నాకు లేని సింపతీ నీకు కావాలంటావు.

భాస్కర్ : చచ్చిన వాణ్ణి ఇంకా చంపకు, నిర్మలా!

నిర్మల : ఈ పశ్చాత్తాపంతో చేసిందంతా చెల్లయిపోతుందనేగా!

భాస్కర్ : పరిస్థితి అలా దాపురించింది, నిర్మలా! ఆ భయంకర క్షణాలు నన్ను పశువుగా మార్చేశాయి.

నిర్మల : అసలు నువ్వు మనిషివనే అనుకొంటున్నావా?

భాస్కర్ :( ఆవేశంగా ) మనిషిని. నేను మనిషినే! అందుకే ఈ మనుష్యులున్న


గ్రామ్సు : కామాక్షి సిల్కు ఫోన్ :77376

దసరా దీపావళి పండుగల సందర్భముగా ప్రత్యేక రిబేటు

28-9-76 నుండి 22-10-76 వరకు

10% + 10% రిబేటు ఇవ్వబడును

స్త్రీల సౌందర్యాభివృద్ధికి వలయు అసలైన వెండి జరీతో తయారయిన కంచి పట్టుచీరలు, లంగాలు.

కంచి ధరలకే విజయవాడ బ్రాంచిలో లభించును.

ఆదివారములు, పండుగ రోజులలోకూడా షాపు తెరచియుండును.

కంచి కామాక్షమ్మ పట్టు చేనేత కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ G-1612

హెడ్డాఫీసు: కంచి, 168-A, గాంధీ రోడ్డు.

బ్రాంచిలు: మసీదు వీధి, ఏలూరురోడ్డు, విజయవాడ-520002.

27, 2-వ అగ్రహారం, సేలం-1.

కె. యస్. పార్థసారథి, అధ్యక్షులు.

టి. ఆ. జ్ఞానసుందరం, బి.ఎ. కార్యదర్శి.

SAVITA

ఈ సమాజంలో నేను నేనుగా గుర్తింపబడకపోవడం సహించలేక పోయాను. అణగారే ఆశలకు అనుక్షణం జీవం పోసుకొంటూ— మనిషిగా బ్రతకడంకోసం, బ్రతుకు తెరువుకోసం, రెండు పూటలా కడుపు నిండడంకోసం ఎండమావులతో పరిగెత్తాను. నేను ఉద్యోగం ఆశించడం పేరాశ కాదు. అది కూడా నా చదువుకు తగ్గ దానికోసం కాదు; కనీసపు అవసరాలకోసం! ఐ వాంట్ నీడ్స్ ఓన్లీ — బట్ నాట్ వాంట్స్. చివరకు రిక్షా లాగే ప్రయత్నం చేసి దెబ్బ తిన్నాను. దాని క్కావలసింది చదువుకాదు; కండల్లో శక్తి, ఆశక్తి నాకు లేదు. అందుకు ఆ విధంగా కూడా బ్రతకలేకపోయాను.

నిర్మల : నీ బ్రతుకుకోసం నా బ్రతుకుని బలిచేశా నంటావు. ఇందులో నీ తప్పే లేదంటావు?

భాస్కర్ : తప్పు లేదని, చేయలేదని అనలేను. అందుకే ఒప్పుకుంటున్నాను, క్షమించమంటున్నాను.

నిర్మల : ఈ పంజాయిషీ ఎవడి క్కావాలి!

భాస్కర్ : ఏమైనా నువ్వు నాకు కావాలి.

నిర్మల : అవునవును, కావాలి! హూఁ. నువ్వెంత స్వార్థపరుడివి, భాస్కర్! నా ఆనే అధికారం నాకు లేకుండాజేసి, దాన్ని త్యాగంగా సమర్థించుకొంటున్నావా?

భాస్కర్ : ( బ్రతిమాలుతూ ) జరిగినదా న్నిక గుర్తు చేయకు, నిర్మలా!

నిర్మల : ఎందుకు మరిచిపోవాలి!

భాస్కర్ : భవిష్యత్తు ఆశాజనకంగా ఎదురుచూస్తూంది గనక.

నిర్మల : గత ప్రభావం అంత తేలిగ్గా తొలగిపోదు.

భాస్కర్ : తలుచుకుంటే అదెంతసేపు! స్మాష్ ... స్మాష్ చేసి పారేయి.

నిర్మల : ఇక్కడ కూడా నీ స్వార్థమేనా! నాకూ హృదయం ఉంది.

భాస్కర్ : ఉంటే, దాన్ని పీకి పారేయి!

నిర్మల : ఆ పని ఎప్పుడో జరిగింది.

భాస్కర్ : పోనీయి, మరో కొత్త హృదయం చిగురిస్తుంది.

నిర్మల : ఇప్పు డంటున్నాను, నువ్వు అసలైన మగాడివని. కోతి రూపంలో ఊపిరి పీల్చిన మనిషి రాతియుగం నుండి నీతి యుగంవరకూ వచ్చి కూడా నాతి విషయంలో నాటి రాతి తత్వాన్ని, కోతి చేష్టల్ని ప్రదర్శిస్తూనే ఉన్నాడు.

భాస్కర్ : నన్ను విసిగించక, నీ అభిప్రాయం ఏమిటో సూటిగా చెప్పు.

నిర్మల : చెప్పవలసిన అవసరం లేదు. ఎవరి తృప్తికోసం ఈ తతంగం?

భాస్కర్ : నా కోసం.

నిర్మల : మరి నా సంగతి?

భాస్కర్ : ఒకదానితో ఇద్దరం తృప్తిపడదాం!

నిర్మల : స్త్రీగా నాకూ కొన్ని ఆశయాలు, ఎన్నో ఆశలు ఉన్నాయి. అందుకు సముద్రాలు దాటాను. నదులు ఈదాను. కాలవలు దూకాను. చివరకు చిన్న మురికి గుంటలో చిన్న చేపకు చిక్కి సర్వం కోల్పోయాను. ( ఏడ్చింది. )

భాస్కర్ : నువ్వేం పోగొట్టుకోలేదు, నిర్మలా!

నిర్మల : ( ఎర్రగా చూసింది ) షటప్. నన్ను రెచ్చగొట్టకు.

భాస్కర్ : ఉద్రేకపడకు, సావధానంగా ఆలోచించు.

నిర్మల : అందుకే వెడుతున్నాను

భాస్కర్ : ( గాభరాగా ) ఎక్కడికి?

నిర్మల : ఎక్కడికయితే ఏం? నే నిప్పుడు స్వేచ్ఛా విహంగాన్ని. ఉన్నతంగా నిర్మించుకొన్న పరిధులనుండి బలవంతంగా బయటపడిందాన్ని, ఇదంతా నీ చలవే!


భాస్కర్ : నీ ధోరణి నా కర్థం కావడం లేదు.

నిర్మల : అది నీ దౌర్భాగ్యం. ( వెళ్ళబోయింది. )

భాస్కర్ : ( అడ్డపడుతూ ) వద్దు. నువ్వు వెళ్ళడానికి వీల్లేదు.

నిర్మల : నువ్వెవరు నన్నాపడానికి. అడ్డులే! లెమ్మంటూంటే ...! నీ నీతులు, ఉపదేశాలు మరో నిర్మల దగ్గర ప్రారంభించు.

( నిర్మల వెళ్ళబోగా భాస్కర్ అడ్డపడ్డాడు. ఆ పెనుగులాటలో నిర్మల విడివడి — భాస్కర్‌ను తోసి బయటకు పరిగెత్తింది. భాస్కర్ తూలు తుంటూ వచ్చి నులక మంచంలో కూలబడిపోయాడు. రెడ్ లైట్ ఆఫ్ అయి, ఊహా దృశ్యం ముగిసింది. )



చినుకులు —చిత్రం ఎస్. మురళీధరరావు ( హైదరాబాదు )

లైట్లు వెలిగాయి. నిజస్థితిలో భాస్కర్ యథాప్రకారం మంచంమీదే పడుకొని ఉన్నాడు. ఇంతలో అబ్బులు దండలతో పరుగున వచ్చి "బాబూ!" అంటూ పొలికేక పెట్టాడు. ఆ కేకకు భాస్కర్ ఉలిక్కిపడి లేచాడు. )

భాస్కర్ : ( నలువైపులకు చూస్తూ — కంగారుగా ) అబ్బులూ, నిర్మల పారి పోతూంది, పట్టుకో ... పరిగెత్తు, అబ్బులూ!

అబ్బులు : ( ఏదో చెబుదామనుకున్న వాడల్లా, అతని మాటలకు అర్థంగాని అయోమయంగా ) సెల్లెమ్మ పారిపోవడం ఏటి, బాబూ. నిద్రలోగాని కల గన్నారా?

భాస్కర్ : ( తేరుకొంటూ ) జరిగింది వాస్తవం కాదన్న మాట! ( పూర్తిగా స్తిమితపడుతూ ) హమ్మయ్య, పోన్లే, బ్రతికాను.

అబ్బులు : ( విషయం ఎలా చెప్పాలో తెలియని అశక్తతో ) నువ్వు బతికిపోనావు గానీ ... అన్నేయం జరిగిపోనాది, బాబూ, అన్నేయం!

భాస్కర్ : అన్యాయమా? ఎవరికి?

అబ్బులు : నీకూ, నాకూ, అందరికీ! ( బాధపెల్లుబకగా ) సెల్లెమ్మ ... సెల్లెమ్మ నా నోరు రాకుంతన్నాది. ముందల అరిజెంటుగా బయలుదేరు బాబూ!

భాస్కర్ : ( గుండెలు చేతబట్టుకొని ) ఎక్కడికి?

అబ్బులు : ఆసుపత్రికి.

భాస్కర్ : హాస్పటల్‌కా? ఎందుకు? నిర్మల కేం జరిగింది, చెప్పు?

అబ్బులు : ( గొల్లుమన్నాడు ) ఏం సెప్పను, బాబూ, దండలు తీసుకొత్తాంటే, మెయిన్‌రోడ్డు మలుపులో సెల్లెమ్మ అవుపించినాది. మనిషేమో తూలిపోతూ నడుత్తాంటే, ముందల ఎవులో అనుకొన్నాం! తీరా సూత్తే సెల్లెమ్మ! గుండె దడదడలాడిపోగా, రిక్షా దిగెల్లి ఇలా రెక్కట్టుకున్నానో లేదో, అలాగే మా సేతుల్లో వాలిపోయి కళ్ళు తేలేసినాది. ( భాస్కర్ వింటూ కొయ్యబారిపోగా ) ఎలాగుందో, ఏటో రా, బాబూ, ఏగిరం ఎల్దాం?

( భాస్కర్ తేరుకొని అబ్బులుతో పరుగున బయటకు వెళ్ళబోతూంటే, నిర్మలను మోసుకొస్తున్న సింహాద్రి గుమ్మంలో ఎదురయ్యాడు. అతను భారంగా అడుగులు వేసుకొని వస్తూంటే, తదనుగుణంగా వీళ్ళిద్దరి అడుగులు వెనక్కి పడ్డాయి. సింహాద్రి నిర్మలను మంచం మీద పడుకోబెట్టాడు. భాస్కర్,

అబ్బులు మంచానికి చెరో పక్కా చేరారు. దారుణమైన నిశ్శబ్దంలో ఈ క్రియ జరిగిపోయింది. )

అబ్బులు : ( ఆత్రంగా ) గురూ, డాక్టరుగారేమన్నారు? సెల్లెమ్మకేం ఎర్వా నేడుగా! తెలివెప్పుడొస్తాదేటి?

( అంటూనే ఒళ్ళు తడిమి చూసి కొయ్యబారిపోయాడు. )

సింహాద్రి : ఇంకెక్కడి తెలివిరా, ఇసం మింగేత్తే సూ!

( సింహాద్రి కూలబడిపోయి, రెండు చేతులతోనూ ముఖం కప్పుకొని బావురుమన్నాడు. ఈ మాటలు విన్న అబ్బులు, భాస్కర్ పిచ్చిగా అరుస్తూ కూలబడి పోయారు. రోదనలో కొన్ని క్షణాలు భయంకరంగా గడిచాయి. )

సింహాద్రి : ( తేరుకొని విరక్తిగా ) తీరిపోనాది. రుణం తీరిపోనాది, బాబూ!! నువ్వూ, నానూ అందరం పెట్టు ఆసలన్నీ బెమలయిపోనాయి, బాబూ, బెమలయిపోనాయి.

అబ్బులు : సావుకోసం ఎందుకమ్మా తొందరపడిపోనావు? నీకేటన్నేయం జరిగినాదని ఇలా తెగించినావు?

సింహాద్రి : నువ్వెవులో, మావెవులో, ఎవులి కెవులూ తెల్దు! మా అదురుట్టంగా ఈ సంచ కొచ్చినావు. "అన్నయ్యా" అని వరస కలిపి, ఓ తల్లికి పిల్లల్ని సేసేసినావు. రాతి గుండెల్లో దీపా లెలిగించి, అటితోనే సిచ్చుబెట్టి ఎగిరిపోనావామ్మా!

అబ్బులు : మాం పాశం పెంచుకొంది ఇలా ఏడ్దానికా, తల్లీ!

సింహాద్రి : సూడు ... సూడు, తల్లీ, ఆ బాబుకేసి. ఆయనకు నా నేవని సెప్ప నమ్మా! ఏం సెప్పి ఆయన బాధ సలార్చనమ్మా! బాబు నిన్ను పెళ్ళి సేసుకుంతానన్నాడమ్మా, పెళ్ళి!

అబ్బులు : నువ్వో ఇంటిదాని వవుతావని, మాం లెగ సంబరపడ్డాం! సల్లంగా ఎళ్ళి పోవాలిసిన నూరేళ్ళ బతుకూ, ఇంత బేగా తెల్లారిపోనాదామ్మా!

సింహాద్రి : నువ్వు తోడుంటే, ఇంత దారుణం జరగదు, బాబూ, జరగదు.

అబ్బులు : అది నీ పిచ్చిగానీ అస లిలా జరుగుతుందని ఎవరైనా అనుకుంటా రేటి? సెల్లెమ్మ బుమంతంగా సచ్చే పెంకెది కాదు. కాని, ఎందుకో బతకలేకే ...

సింహాద్రి : అదే ... ఎందుకు బతకలేననుకొందని? ఇంతలోనే ఏటయిపోనాదని?

భాస్కర్ : ( బాధ గుండెలు పిండేస్తుండగా వాళ్ళిద్దరికి ఆవేదనతో మరింత ఉద్ధతం కాగా, అంతరాత్మ నిలదీస్తుండగా పశ్చాత్తాపంతో దహించుకుపోతూ)

ఎంతటి ఘోరానికి ఒడిగట్టావు, నిర్మలా! జరిగిందాన్ని భరించలేక, నిన్ను నీవే ఆత్మార్పణం చేసుకొన్నావా? నా మీద ఇలా కసి తీర్చుకున్నావా? నువ్వు చనిపోవడం కాదు గానీ, నన్ను చంపావు. బ్రతికుండగానే నేను చచ్చాను.

సింహాద్రి : ( ఓదార్పుగా ) బాబూ ... బాబూ ... బాధపడకు. కాత్తంత ధైర్యపడు. పడాలి, తప్పదు. గుండె రాయి సేసుకోవాలి మరి.

అబ్బులు : అన్నీ తెలుసున్న నువ్వే ఇలా అయిపోతే ఎలా, బాబూ?

భాస్కర్ : ( సానుభూతికి తట్టుకోలేక అరిచాడు. ) ఆగండి ... వద్దు. నన్ను ఓదార్చవద్దు. నాకు సానుభూతి చూపించవద్దు. దాంతో నేను మరింత చస్తున్నాను. నేను స్వార్థపరుణ్ణి! భరించలేను ... భరించలే నీ బాధ! మీకు చెప్పాలి. అంతా చెప్పేస్తాను, అప్పుడే నాకు శాంతి.

సింహాద్రి : ( అయోమయంగా ) అబ్బులూ, ఏటది? బాబుగ్గానీ పిచ్చెక్కుతూం దేట్రా?

భాస్కర్ : ( రెచ్చిపోతూ ) పిచ్చే! నాకు నిజంగా పిచ్చెక్కింది. నిర్మలను నేనే మోసం చేశాను.

సింహాద్రి, అబ్బులు : ( విస్తుబోతూ ) నువ్వా?

భాస్కర్ : నేను ... నేనే!

సింహాద్రి : దరమరాజువి. నువ్వు సేయడం ఏటి, బాబూ?

భాస్కర్ : చేశానంటూంటే, వినరేం?

అబ్బులు : అయితే, సెల్లెమ్మ ఇసం మింగడం నీకు తెలుసా?

భాస్కర్ : తెలీదు. కాని, ఆమె నా వల్లే విషం మింగింది. నా వల్లే చచ్చిపోయింది. కారకుణ్ణి నేనే!

సింహాద్రి : ఏటీ, సెల్లెమ్మ సావుకు నువ్వా కారణం! మాం నమ్మం. నమ్మేంత ఎదవలం కాం!

భాస్కర్ : మీరేకాదు, ఎవరూ నమ్మలేరు. నా మంచితనం మీద మీకో పెద్ద నమ్మకం ఉంది. అది దేన్నీ నమ్మనీయదు. మీరు నమ్మినా, నమ్మకపోయినా నిజం దాచి దాచలేను.

సింహాద్రి : ఏటో, అంతా అయోమయంగా ఉన్నాది.

భాస్కర్ : ఇక మీరేం మాట్లాడొద్దు. నేను చెప్పేది వినండి.

( ఆవేశం తగ్గించుకొంటూ, తగ్గుస్థాయిలో ప్రారంభించాడు. )

నిర్మలా, నేనూ ఇంటర్వ్యూకు వెళ్ళాం! ఎప్పటిలాగే నాకు ఆశాభంగం అయింది. డబ్బు, రికమండేషన్లతో ప్రాధాన్యం వహించిన ఆ ఇంటర్వ్యూ తతంగం నన్ను తిప్పికొట్టింది. నా భంగపాటును గమనించిన నిర్మల ఎంతో బాధపడింది. తను ప్రయత్నిస్తానంటూ ఆమె లోనికెళ్ళింది. అతి కష్టం మీద ఆఫీసర్ని కలిసి నన్నూ, నా బ్రతుకునూ వివరిస్తూ వేడుకొంది. "సాయంత్రం ఇంటిదగ్గర కలవండి, చూదాం" అన్నాడట వాడు.

నేను ఇష్టపడకపోయినా, నిర్మల సూచన మేరకు సాయంత్రం ఇంటి దగ్గర కలిశాం! ఉద్యోగం ఇవ్వడానికి షరతు పెడుతూ, వాడు నిర్మల శరీరాన్ని కోరాడు. నిర్మల వాణ్ణి తిట్టి బయటకు వచ్చేసింది. ఆమె అనుభవం నాతో చెబుతూంటే ... నాతో చెబుతూంటే— ఎన్నడూ కలగని ఆలోచన నాలో కలిగింది. దాంతో నా బుద్ధి హఠాత్తుగా వక్రించింది. మానవత్వం నశించింది. స్వార్థం పడగ విప్పింది. ఆదర్శాలు, ఆశయాలు ... సంస్కృతి అన్నీ ... అన్నీ ... కేవలం ఉద్యోగంకోసం విస్మరించాను. నాలో రాహువు ప్రవేశించాడు. ఆ గ్రహణ ప్రభావంతో, నా కోసం ఆఫీసర్ కోర్కె తీర్చమన్నాను. నిర్మల నా వంక విచిత్రంగా చూసింది — బ్రతిమాలాను. ఆశ్చర్యపడింది. లాలించాను. అసహనంతో దెప్పిపొడిచింది. బుజ్జగించాను. తిట్టింది, కొట్టింది, విమర్శించింది, చీదరించుకొంది. అయినా .... అయినా నేను లెక్కచేయలేదు. నా పట్టు విడవలేదు. చేతి కందబోయే ఉద్యోగాన్ని చేజిక్కించుకోవాలన్న తాపత్రయం నాలో మొండితనాన్ని, పశుత్వాన్ని ప్రకోపింపజేసింది. కర్కశంగా నిర్మలను ఆఫీసరుకు అప్పగించాను. నా చేజేతులా నేనే ఆమెను పంకంలోకి తోసివేశాను. కానీ ... ఇప్పుడు తెలుస్తూంది నేను చేసిందేమిటో ... నాకు ... నాకు ... నేను చేసిన దానికి ...

( భాస్కర్ ఇంకా ఏదో చెప్పబోతూండగా, పట్టరాని ఆవేశంతో అబ్బులు ఊగిపోతూ పిచ్చిగా అరిచాడు. )

అబ్బులు : ఆగు. ఆగరా! ఇక సెప్పొద్దు! నా వినలేను. ( పళ్ళు కొరుకుతూ ) ఆహా...ఇదంతా నీ పెయోజకత్వమే నన్న మాట! ఎంత పని సేశావురా, నన్నా సెదవా! నీకు చేతు లెలా వొచ్చినాయిరా!

( బెబ్బులిలా మీదకు లంఘించబోగా — తీక్ష్ణ దృష్టితో, స్తబ్ధుడై ఉన్న సింహాద్రి తేరుకొని, అబ్బుల్ని వెనక్కి నెట్టాడు. ఇంకా అబ్బులు రెచ్చిపోతూండగా )

సింహాద్రి : ( ఎంతో నిదానంగా — మరింత నెమ్మదిగా ) అబ్బులూ, ఏటా తొందర? ఇప్పు డేవయినాదని?

అబ్బులు : ( ఉక్రోషంగా ) ఏవయినాదిరా! అదిగో — ఎదురుగా అవుపట్టం నేదా? ( నిర్మల శవాన్ని చూపాడు. )

సింహాద్రి : బాబు సేసిందాంట్లో తప్పేం నేదురా!

అబ్బులు : ( దెప్పిపొడుపుగా ) ఏటీ, తప్పు నేదూ! నేదులే, గురూ ... నేదు. ఈడు పెట్టిన పోరు ఇన్నందుకూ, సెప్పిన మాటలు నమ్మినందుకూ, గొప్పోడిగా సూసుకున్నందుకూ... తప్పంతా మనదే... మనదే, గురూ!

భాస్కర్ : మీరు నిప్పులాంటి వాళ్ళు!

అబ్బులు : ( అరిచాడు ) అవున్రా! నీళ్ళోసి సల్లారుద్దా మనుకోకు. ఈ నిప్పు రాజుకొని ... రాజుకొని — రగిలి ... రగిలి — ఇన్నా, నీలా సెదవల్ని మాడ్చి మసిసేసి పారేత్తాదిరా!

సింహాద్రి : ( మందలింపుగా ) అబ్బులూ, కాత్తాగు.

అబ్బులు : ఇంకా ఆగడం ఏటి, గురూ! ఈణ్ణి ... ఈణ్ణి ...

సింహాద్రి : ఆగు మరి! నువ్వేనేట్రా తెలివైనోడివి? నీ కొక్కడికేనా బాధుంట! ఓ... పెచ్చురేగి పోతన్నా వేటని? ఆ ఇరకాటంలో ఎవులుమాత్రం ఏం సేత్తారు, సెప్పు? ఏం, బాబూ?

అబ్బులు : ఆ... ఆ... నువ్విలాగే ఈణ్ణి ఎనకేసుకు వత్తుంటే, ఇనుమంటి

మను లెన్నయినా సేసేత్తాడు. ఈడు తడి గుడ్డలతో గొంతుకలు కోసే రకం!

భాస్కర్ : వద్దు. నన్ను క్షమించొద్దు.

సింహాద్రి : ఛ ... అయ్యేం మాటలు, బాబూ!

అబ్బులు : ఆహా ... ఆహాహా ... ఏం సితులు సెప్పినావురా?

సింహాద్రి : అవున్రా, సెప్పాడు. నోటికొచ్చింది, గురుతూన్నది, మంచి సెడ్డ అన్నీ సెప్పాడు. ఊఁ ... అయితే ...!

అబ్బులు : అయితేంటప్పుడు, ఈడు సేసిన పనేటని?

సింహాద్రి : మన కంటే సెప్పాడుగాని — ఆయన కాయన సెప్పుకున్నాడేటి?

అబ్బులు: ఆహా! ఈడికో నేయం, మనకో నేయం! నేయాల్లో రకాలుంటాయేటి? నాకొప్పుకోను. ఇదిగో, రాతి బొమ్మకు దణ్ణమెట్టి దేవుడిగా సూత్తే, పాపం పోద్దో లేదో నాకు తెల్దుగాని ... యినుమంటోణ్ణి మంచోడిగా సూసి దన్నమెడితే పున్నెం రాదు గాని, పాపం పదింతలు పెరిగెత్తాది.

సింహాద్రి : అందుకే పెరిగిన పాపం కడుక్కోవాలంటన్నాను. అంతేగా, బాబూ! ( భాస్కర్ భుజం మీద చెయ్యేసి ఆప్యాయంగా కుదిపాడు. సాత్వికత అతని మోమునుండి మెల్లగా తప్పుకుంటూ, రంగులు మారుతూ గాంభీర్యం క్రమేపీ అలుముకోసాగింది. )

బాబూ, మాపేటో — మా బతుకులేటో — ఎందుకోగాని, ఉప్పెనలంగా గుర్తు కొత్తన్నాయి. యెతవలం ... యెతవలుగానే ఉండిపోక, కట్టపడి బతుకుతానవడం ఏటి — మంచిగా ఉంటా ననటం ఏటి. నాకాల్తల్లి మీద పెమానకం సేసి, నీతో పంతం పట్టడం ఏటి? ఛ ఛ! ఏ రకమోళ్ళు ఆ రకంగానే ఉండిపోవాలి



ప్రకృతి  చిత్రం—చిన్నారి చిన్నికృష్ణ ( అనకాపల్లి )

గానీ! అయినా, మాం మంచోళ్ళం! మువ్వున్నావు సూశావూ, "మంచిని కాపాడ్డంకోసం ఏదైనా సేయమని" సేసినాం! ( నిర్మలత్వం చూపుతూ ) అదిగో ... అదిగో మా మంచితనానికి గురుతు. కాని, గురుతు నిలబడిందా ... లేదు! నా మంచితనం నచ్చిపోనాది. దొంగెదవలకి మంచేటని. గురుతు ఎగిరిపోనాది. ఆ బాధ ఈ రాతి గుండెల్లో గునపంలా దిగబడి, తొలిసేత్తాంటే ... ఈ బాధ పల్లారాలంటే ...

( అంటూ ఒక్కసారి ఉగ్రుడై, భాస్కర్ గొంతు పట్టుకొని నొక్కాడు. అబ్బులిది చూసి భయంకరంగా నవ్వుతూ "గురూకీ జై" అంటూ వచ్చి, భాస్కర్‌ను వెనకనుంచి నొక్కాడు. ఉగ్రరూపాలతో ఉన్న వాళ్ళిద్దరి దారుణ కృత్యానికి భాస్కర్ గిలగిలా తన్నుకొంటూ కళ్ళు తేలేసి అచేతనుడై పోయాడు. సింహాద్రి ఆవేశంతో నిర్జీవుడైన భాస్కర్ వంకే చూస్తూంటే, అబ్బులు అతని మెడలో రెండు దండలు వేసి జై కొట్టాడు. )

సింహాద్రి : నాను సేసింది మంచిపనేనా?

అబ్బులు : అందుకేగా, గురూ, రెండు దండలేత్తు!

సింహాద్రి : లేదు, నాను సేసిందాంట్లో అన్నేయం ఏం లేదు. పదరా, అబ్బులూ!

అబ్బులు : ఎక్కడికి, గురూ!

సింహాద్రి : ముందు సారా కొట్టుకి. పీకల్దాకా మందు కొట్టేసి, అక్కణ్ణుంచి ...

అబ్బులు : అక్కణ్ణుంచి ...

సింహాద్రి : అత్తోరింటికి, పోలీస్ టేషన్‌కురా, ఎర్రిమొగమా!

అబ్బులు : పద, గురూ, పద!

( ఒకరి భుజాలమీద మరొకరు చేతులు వేసుకొని వెళ్ళిపోతూండగా తెర పడింది. )

*